ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగష్టు 13, 2017

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell : 9849070838

ఆ రోజుల్లో అండమాన్ జైలు



భారతీయుడు

మెయిన్ స్ట్రీమ్ కమర్షియల్ సినిమాలేకాదు దేశభక్తి చిత్రాల్లో విలక్షణతని ప్రదర్శిస్తాడు కమల్. అందుకే తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ ఇలా ఎన్ని భాషల్లో నటించినా ప్రతిచోటా తన మార్కు వుంటుంది. వివిధ చిత్రసీమల్లో ప్రవేశించిన స్టార్ హీరోగానే కాదు ఏ భాషలో నటించినా విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకుంది కూడా బహుశా కమలేనేమో. ఓ సామాన్య వ్యక్తిలా కనిపించిన చిత్రాలు కొన్నయితే రొమ్యాంటిక్ హీరోగా గుర్తింపు తెచ్చిపెట్టిన చిత్రాలు మరికొన్ని. అలా తనకంటూ ఓ ప్రత్యేకమైన యాటిట్యూడ్, స్టైల్‌తో కొనసాగుతున్న కమల్ దేశభక్తి చిత్రాల విషయానికి వచ్చేసరికి ఆ లుక్కే మారిపోతుంది.

చాలా సీరియెస్ కథాంశాలు, ఎవ్వరూ సాహసించని పాత్రలు కమల్‌కే సాధ్యమనేలా ఉంటాయి. ఉదాహరణకు 'భారతీయుడు'లోని రెండు పాత్రల్లో అటు అవినీతిపరుడైన కొడుకుగా, ఇటు అతన్ని శిక్షించాలనుకునే తండ్రిగా విలక్షణమైన నటనను కనబరుస్తాడు. దేశం కోసం పోరాడిన 'భారతీయుడి'గా ఆ చిత్రంలో ఒదిగిపోయాడు. దేశభక్తిపై ఎన్ని చిత్రాలొచ్చినా కమల్ నటించిన చిత్రాల్లో ఓ ప్రత్యేకత వుంటుంది. సమకాలీన అంశాలు కథావస్తువుగా వుండే తన చిత్రాల్లో తన నటన కూడా అంతే ప్రత్యేకతని చాటుతుంది. అలా 'ఈనాడు', 'విశ్వరూపం' లాంటి చిత్రాల్లో అద్భుత నటనతో పాటు తన దేశభక్తిని చాటుకున్నాడు కమల్. ఇటీవలే తను నటించిన స్పై థ్రిల్లర్ చిత్రం 'విశ్వరూపం-2' భారతీయుల్లో మరో కొత్త మార్పుని తెచ్చేందుకు అక్టోబర్‌లో విడుదల కానుంది.

విభిన్న శిఖరం



విజేత

పారాక్లైంబింగ్‌లో భారత్ పేరు ఎక్కించాడు మణికందన్ కుమార్. ఐదేళ్లపుడు పోలియో బారిన పడిన ఈ విభిన్న ప్రతిభావంతుడు ఆ తర్వాత కొండల్ని ఎగబాకే క్రీడనే జీవితంగా చేసుకుని విజేతగా మారాడు. అస్సలు ఊహించని రంగంలో భారత్‌కు పతకాల పంట పండించాడు. ప్రపంచ చాంపియన్‌గా నిలిచి భారత్ ఖ్యాతి ఉన్నత శిఖరాన్ని ఎక్కించాడు. ఈ విజేత చేతి పట్టు, గుండె బలమే అతడి కెరీర్‌ను పైపైకి తీసుకెళుతోంది. రానున్న 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పారాక్లైంబింగ్ కూడా చేరడంతో దేశానికి ఓ ఒలింపిక్ పతకం మణికందన్ నుంచి ఖాయంగా కనిపిస్తోంది.

మణికందన్ కుటుంబం బెంగళూర్‌లోని మల్లేశ్వరానికి చెందినది. తల్లి అగర్‌బత్తీలు తయారుచేసే పనికి వెళుతుంది. తండ్రి ఓ కార్పెంటర్. అతడికి ఐదేళ్లపుడే పోలియో వల్ల కుడికాలు పాడైంది. సరిగ్గా నడవడానికి కూడా ఇబ్బంది పెట్టే శరీర బలహీనతను ఎలా అయినా జయించాలనుకునేవాడు. తన స్నేహితులు మైదానంలో చురుగ్గా ఆడుకునే దృశ్యం మణికందన్‌ను క్రీడలపై ఆసక్తి కలిగించింది. కానీ, తల్లిదండ్రులు ఎక్కడ గాయాలపాలవుతాడోనని అడ్డుచెప్పేవాళ్లు. పూర్తిగా చదువుకే అంకితమైతే పెద్ద ఉద్యోగం వచ్చి ఇబ్బందులు లేకుండా ఉంటాయని చెప్పేవాళ్లు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి గురించి పూర్తి అవగాహన ఉన్న మణికందన్ ఇంజినీర్ అవుదామనుకున్నాడు. ఖాళీ సమయాల్లో ఫుట్‌బాల్‌ను విడిచేవాడు కాదు. కానీ పదో తరగతి సెలవులు అతడి జీవితాన్ని మలుపుతిప్పాయి. 2001 పరీక్షల్లో తప్పడంతో పూర్తిగా దిగాలు పడిన మణికందన్ స్కూల్ ట్రిప్‌లో రామ్‌నగర్ వెళ్లాడు. అక్కడ ఉన్న ఓ కొండపైకి ఓ విభిన్న ప్రతిభావంతుడు తాళ్ల సాయంతో ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ దృశ్యం మణికందన్‌ను ఆలోచనలో పడేసింది. తాను కూడా పేరు తెలీని ఆ ఆట ఆడాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికీ పారాక్లైంబింగ్ అనేది దేశంలో అంతగా తెలీని క్రీడ. దీనికి భవిష్యత్తు ఉందో లేదోనని తండ్రి అడ్డుచెప్పి తనతో పాటు పనికి రమ్మని కోరాడు. కానీ ఒక్క అవకాశం తీసుకుని అప్పటి క్లైంబింగ్ పోటీల్లో పాల్గొని టాప్‌లో నిలిచాడు. మిగతా పదిమంది కూడా సాధారణ క్లైంబర్లే. అలా తండ్రిని మెప్పించి ఓ ఇన్‌స్ట్రక్టర్ సాయంతో బెంగళూరులోని రాష్ట్ర యువ కేంద్రంలోని స్పోర్ట్ క్లైంబింగ్ వాల్ వద్ద శిక్షణకు చేరాడు. ఆ తర్వాత వరస విజయాలతో సంచలనంగా మారాడు. 2003లో బెంగళూరు



చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో మణికందన్‌కు ఉత్తమ క్లైంబర్‌గా జాతీయ అవార్డు వచ్చింది. అలా వివిధ దేశవాళీ పోటీల్లో పాల్గొంటూ మొత్తం 11 పతకాలను సాధించాడు. రోజుకు ఆరుగంటల పాటు ప్రాక్టీస్ చేసే మణికందన్ ప్రతిభ ప్రపంచానికి తెలిసింది ప్రపంచ చాంపియన్‌షిప్ ద్వారానే. 2012లో తన కెరీర్ శిఖరాగ్రాన్ని అందుకుంది.

పతకాల పంట

తొలిసారి ఫ్రాన్స్ పారాక్లైంబింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. ఆ మరుసటి ఏడాదే ఇటలీ, ఇంగ్లండ్ వరల్డ్ కప్‌ల్లో రజతాన్ని కైవసం చేసుకున్నాడు. 2014 సీజన్‌లో ఫ్రాన్స్‌లో 6వ స్థానంలో నిలబడితే, స్పెయిన్, యూకే, ఆస్ట్రియా ప్రపంచ కప్‌ల్లో రజత పతకాలు సాధించాడు. 2015లో ఆస్ట్రియాలో స్వర్ణంతో తనకు తిరుగులేదని చాటాడు. అదే ఏడాది ఫ్రాన్స్‌లో మళ్లీ రజతం చేజిక్కించుకున్నాడు. స్పెయిన్‌కు చెందిన రామోన్ జులియన్‌నే స్ఫూర్తిగా భావించిన మణికందన్ అతడి స్థాయిలో ప్రదర్శన ఇచ్చాడు. 2016 సర్క్యూట్‌లో నాలుగింటిలో మూడింటిని గెలిచాడు. యూకే ప్రపంచకప్ స్వర్ణాన్ని అందుకున్నాడు. ఈ ఏడాది కూడా 6 పారాక్లైంబింగ్ ప్రపంచ కప్‌ల్లో మణికందన్ అద్భుత ప్రదర్శన ఇచ్చాడు.



జపాన్, కెనడా, యూరప్‌ల్లోని వాల్‌ల వద్ద శిక్షణ తీసుకుంటే టోక్యోలో పతకం ఖాయమని కోచ్‌లు చెబుతున్నారు. భారత్‌కు ఒలింపిక్ పతకాన్ని తెచ్చే వీరుడిగా మణికందన్ పేరు ఇప్పుడే రాసేసుకోవచ్చని అతడి కోచ్‌ల గట్టి విశ్వాసం. ★

స్ఫూర్తి 3

తల్లీ బిడ్డలు

ధీర........4

శిఖరాలను తాకిన బైక్ రైడర్

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం..........10

మరీ చింపిరి

తెలుసా............... 11

కాంతి చిత్రం

కవిత్వమ్..............14

మహాధనం

ఇండెక్స్

ఆ రోజుల్లో...అండమాన్ జైలు

అట్టమీది కథ...6

అర్థాంగి అంటే..! ఆపాత చిత్రం- 12

కథ 15

సినిమా చూపిస్త మామా!

కొత్త పుస్తకాలు 18

సోషలిజమే ఎందుకు...

ప్రత్యేకం 19

ఓరోరి యంత్రుడా..!

రుచి....................21

మటన్ ఖడా మసాలా

బాల నేస్తాలు............23

12 ఏళ్ళ స్కేటర్

పద వికాసం........24

కులాల్ని కూల్చే సాహసం

అలనాటి ఆణిముత్యం కులగోత్రాలు చిత్రాన్ని 'కులాన్ని కూల్చే సాహసం' పేరుతో చక్కగా విపులీకరించారు. మొట్టమొదటగా భీమిలీ అందాలు వెండితెరపై ఆరబోసిన ఘనత కులగోత్రాలు చిత్రారాజమని తెలిసి ఆశ్చర్యమేసింది. హేమాహేమీలు నటించిన ఈ చిత్రం గురించి మాకు తెలియని ఎన్నో విశేషాలు ఈ వారం చదివి తెలుసుకున్నాం.

వాడపర్తి వెంకటరమణ, శ్రీకాకుళం.

గాజులో గాజునై

గాజుబుడగలో జెల్లీఫిష్ రూపాన్ని మలిచిన రిక్‌కి హ్యాట్స్ ఆఫ్. గ్లాస్ బ్లోయింగ్ వృత్తిలో కొనసాగుతున్న రిక్‌కి ఇలాంటి ఆలోచన రావడం ఒక అద్భుతం. తను మలచిన ఆ చిత్రాలన్నీ అబ్బురపరిచాయి.

హవానా వీధుల్లోని బరోక్ కళాఖండాలు అబ్బురపరిచాయి. పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గకుండా వుండేలా కోల్‌కత్తా వీధుల్లో తన బండిపై పుస్తకాలను చేరవేస్తున్న 'షా' కృషి అభినందనీయం.

కుక్కపిల్లలకు బోర్‌కొట్టకుండా వుండేలా ట్యూన్‌చేసిన రేడియో ఛానెల్ అబ్బురపరిచింది. సింగిల్ పేరెంట్ కథ, 'ఇదీ బాల భారతం' అట్టమీది కథ, స్టంట్ మాస్టర్ పీటర్ హెయిన్ పరిచయం, ఖాళీజేబు యాత్రికుడు, ఆ పాత చిత్రం బాగున్నాయి.

అవినాష్, విజయనగరం.

ఆకట్టుకుంది

ఈ వారం 30-7-17 స్నేహ ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'ఇది బాలభారతం' కవర్ పేజి కథనంతో రసవత్తరంగా ఉంది. బాలలు కొందరు దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నవారెందరో బాల కార్మికులెందరో... బాలల హక్కుల్ని కాలరాస్తున్న వారెందరో ఈ వ్యాసం కనువిప్పు కావాలి. ప్రచురించినందుకు మీకు ధన్యవాదాలు.

ఎస్. ప్రఫుల్లచంద్ర, ధర్మవరం

కళ్లకు కట్టింది

'ఇదీ బాల భారతం' ఈ వారం అట్టమీద కథ కదిలించింది. కోట్లాదిమంది బాలబాలికలు తగిన పౌష్టికాహారం లేక బక్కచిక్కిపోవడం నిజంగా బాధాకరమే. కొంతమంది బాలకార్మికులుగా బ్రతుకులు వెళ్లదీయటం మరీ బాధాకరం. ప్రభుత్వాలు బాలల రక్షణపట్ల ఉదాసీనంగా వ్యవహరించడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. 44 కోట్ల బాలల్లో 10 కోట్లమందికిపైగా విద్యకు దూరమవుతున్నారంటే ఇంతకంటే ఘోరం మరొక్కటి ఉండదు. సమాజానికి ఉపయోగపడే విధంగా బాలల్ని తీర్చిదిద్దటంలో తల్లిదండ్రులు శ్రద్ధవహించాలనే విషయం ఈ వారం బాల భారతం కళ్ళకు కట్టింది.

మంకు శ్రీను, కొప్పర్రు

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

తల్లీ బిడ్డలు

వెనుక సీట్లో చిన్నది అమ్మకెన్నో కబుర్లు చెబుతోంది. 'నా తల్లే ఎన్ని విషయాలు నేర్చావు' తల్లి మురిసిపోతూ వింటోంది. బండి వేగం కన్నా కూతురి మాటల వేగం ముందుండాలని నిదానంగానే వెళుతోంది. తన చిట్టి తల్లి మాటలు గాలికి వినబడవేమో అని మరింత మెల్లిగా వెళుతోంది. కానీ ఇంతలోనే ఓ భారీ శబ్దం. మాటలతో పాటు కూతురి ప్రాణమూ గాల్లో కలిసిపోయింది. ఏమీ వినిపించని అర్థంకాని గందరగోళంలో తల్లి నేలన అలా పడిపోయింది. ఆ యాక్సిడెంట్ తర్వాత సరోజిని మళ్లీ తల్లయ్యింది. అదీ 800 మంది కన్నవారు లేని బిడ్డలకు. ఆ తల్లీబిడ్డల ప్రయాణం కొనసాగుతూనే ఉంది. మా తుఝే సలామ్.. అమ్మ తుఝే సలామ్... అని అనాలనిపించే ఈ తల్లి కథ ఇది.

సరోజినీ అగర్వాల్ ఓ రచయిత్రి. హిందీలో పీహెచ్‌డీ చేసిన జోధ్‌పూర్‌వాసి. నలభై ఏళ్ల క్రితమే మోటార్ సైకిల్‌పై తిరిగిన ఆధునిక మహిళ. కుటుంబం కూడా కళకళలాడుతూ ఉండేది. స్థిరపడిన భర్త... బంగారంలాంటి కూతురు. ఆ కూతురికి కవల అయిన ఓ అబ్బాయి మరో ఇద్దరు కొడుకులు. ముగ్గురు మగపిల్లల మధ్య యువరాణిలా పెంచుకుంటున్న కూతురు మనీషా అంటే ఆమెకు ప్రాణం. అంతకన్నా మంచి కథ ఇంకేం ఉంటుంది. కానీ లక్నోలో ఆమె అందమైన కథ విషాదకరమైన మలుపు తిరిగింది. 1978లో ఓసారి కూతురిని తీసుకుని మోటార్ సైకిల్‌పై బయటకు వెళ్లింది సరోజిని. దారిలో అదుపు తప్పిన పోలీస్ జీప్ వెనుక నుంచి వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. కూతురు ప్రాణాలు అక్కడే వదలగా ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. శరీరానికి అయిన గాయాలైతే తగ్గాయి కానీ కూతురు పోయిన బాధ ఆమెను కుంగదీసింది. తన రచనలతో ఎంతో మందికి స్ఫూర్తినింపిన తనే ఇలా అయిపోతే ఎలా అని కూతురే వచ్చి నిలదీస్తున్నట్టు అనిపించేది. అంతే ఆమె ఓ విషయాన్ని బలంగా సంకల్పించుకుంది. అంతకు ముందు ఎంతోమంది అనాథ పిల్లల జీవితాల్ని దగ్గరగా చూసిన ఈమెకు అవి కథల్లో కన్నా నిజ జీవితంలోనే సాయపడే అవకాశముంటే బాగుండనిపించేది. పెద్ద కొడుకు కూడా ఇంజినీర్ అయ్యి సంపాదనకు తోడయ్యాడు. అందుకే ఇక ఆలస్యం చేయకుండా తన ఇంటిని అనాథ పిల్లల హోమ్‌గా మార్చేసింది. తన రచనలకు వచ్చే రాయల్టీలతో పాటు భర్త విపి అగర్వాల్‌కు వచ్చే ఆదాయాన్ని కూడా ఆ హోమ్ నడిపించేందుకు ఖర్చు చేసేది. అలా 1985లో తన కూతురి పేరిట మనీషా మందిర్‌ను ప్రారంభించింది. తొలిసారిగా తమ సంరక్షణలోకి తీసుకున్నది అప్పుడే పుట్టిన శిశువును. తల్లి ప్రసవ వేదనతో మరణించడంతో బిడ్డ గురించి సమాచారం అందింది. శిశువు మూగ చెవిటి అని తేలడంతో ఎవరూ తీసుకోడానికి ఇష్టపడలేదు. తల్లి తప్ప ఆ పసిగుడ్డుకు బంధువు ఎవరూ లేరు. ఈ శిశువునే తీసుకుని మళ్లీ తల్లైంది సరోజినీ. ఆ తర్వాత కొన్నిరోజులకే మరో ఇద్దరు పిల్లల్ని అక్కున చేర్చుకుంది. వీరిద్దరి తల్లిదండ్రులు కూడా యాక్సిడెంట్లలో మరణించినవారే. అక్కడి నుంచి ఆ హోమ్ ఎందరో పిల్లలకు తల్లిదండ్రులను అందించింది. సరోజినీ తల్లి ప్రేమకు వీధిబాలలు కూడా హోమ్‌నే అంటిపెట్టుకుని ఉండిపోయారు. కుప్ప తొట్టెల్లో విసిరేయబడినవారు.. వదిలేయబడినవారే కాక వేశ్య గృహాల్లో దారుణ పరిస్థితుల మధ్య పెరుగుతున్న చిన్నారులను కూడా ఆమె రక్షించి తన పెంచుకోవడం మొదలెట్టింది.

ఊయల కట్టి..

కుప్ప తొట్టెల్లోనే మరెక్కడో వదిలేయడం వల్ల అనేక అపాయాలు కలుగుతుండటం చూసి చలించిపోయిన సరోజినీ తన ఇంటి ముందే ఓ 'సంజీవన్ పల్నా' అనే పేరుతో ఊయలను ఏర్పాటు చేసింది. ఎవరన్నా పిల్లల్ని వద్దనుకునేవాళ్లు అందులో విడిచివెళితే చాలు ఇక తానే తల్లి అయ్యి వాళ్ల బాగోగులు చూసుకుంటుంది. ఈ ఊయలలో రెండు రోజుల పసికందును కూడా వదిలివెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అలా వారి సంఖ్య 800కు చేరుకుంది. అంతమంది అవసరాలను తీర్చేందుకు డబ్బు ఇబ్బంది కలిగినప్పుడల్లా మిత్రుల రూపంలో కొందరు చేయందించడం మొదలెట్టారు. అలా మనీషా మందిర్ అనాథలకు, అభాగ్యులకు నిలయమైంది. వారికి తిండి పెట్టి గూడు కల్పించడమే కాదు మంచి విద్యను కూడా అందించి వారి జీవితాల్ని తీర్చిదిద్ది పెళ్లిళ్లతో కొత్త జీవితాలు అందుకునే వరకు సరోజినీ దంపతులు ఆశీర్వచనాలుంటూనే ఉంటాయి. ఇప్పుడు సరోజినీ అమ్మకు 80 ఏళ్లు. ఆమెకు 800 మంది బిడ్డలు. వీరిందరికీ వసతి సౌకర్యం సరిగ్గా ఉండేందుకు వేరే ఆవాసాలకు మార్చారు. ప్రస్తుతం ఉన్నచోట తోటలాంటి వాతావరణంలో నివాస సముదాయాలుంటాయి. ఓ పెద్ద గ్రంథాలయం. బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ కోర్టులు, కంప్యూటర్ ల్యాబ్, పార్క్ ఉంటాయి. అలాగే టీవీ రూమ్ కూడా ఉంది. ఇక్కడ పెరిగి చదువుకున్నవాళ్లలో చాలామంది గొప్ప విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందారు. టీచర్లు, లాయర్లు, బ్యాంక్ ఉద్యోగులుగా మారి ఇంటికి సేవ చేస్తున్నారు. చదువే వెలుగునిస్తుందని సరోజినీ నమ్మినది నిజమై వారి రూపంలో మళ్లీ ఇంటికి అంతోకొంత సాయమందుతోంది. సరోజినికి వీరందరిలో తన మనీషా కనిపిస్తోంది. ఒక్క మనీషా కాదు వందలాది మనీషాలు ఆమె ఆనందాన్ని అమాంతం పెంచేశారు. ★

శిఖరాలను తాకిన బైక్ రైడర్

కిలిమంజారో పర్వతం.. ప్రపంచంలోని ఎత్తయిన శిఖరాలలో ఒకటి. సుమారు 5895 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ పర్వతాన్ని అధిరోహించాలంటే పర్వాతారోహకులకు సవాలుగానే చెప్పకోవాలి. ఆరితేరిన పర్వతారోహకులకే సవాలు విసిరే పర్వతాన్ని అధిరోహించింది సారిక మెహతా. నాలుగు పదుల వయస్సులో తల్లిగా బాధ్యతలని నిర్వర్తిస్తూ నే ఆమె ఓ బైకర్‌గా మారింది. కిలిమంజారోపై తన విజయపతాకాన్ని ఎగరేసింది. మరి పర్వతాలను అధిరోహించిన సారిక ఎందుకు బైకర్‌గా మారిందో తెలుసుకుందాం.

సారికా మెహతా సూరత్‌కి చెందిన మహిళ. పర్వతాన్ని అధిరోహించిన సందర్భంగా ఆమెకు సన్మానం ఏర్పాటుచేశారు. అక్కడ జరిగిన ఓ ఘటనే ఆమెను బైకర్‌గా మార్చింది. 'మీరు పర్వతాలను అధిరోహించగలరు కానీ, ఆడవారు కాబట్టి, దూర ప్రాంతాలకు బైక్‌ను నడపడం మీ వల్ల కాదు' అంటూ సమావేశానికి హాజరైన ఓ బైకర్ హేళన చేశాడు. ఆ క్షణానే సారికా మనసులో తనో బైకర్ అవ్వాలని నిశ్చయించుకుంది. తనలాంటి చాలామంది మహిళలు, అమ్మాయిలు బైక్‌లను అవలీలగా నడపగలరు అని సమాజానికి చూపించాలనుకుంది. అనుకున్నదే తడవుగా బైక్‌ను నేర్చుకుంది. ఆమె తపనే బైక్‌రేసింగ్‌ల దిశగా నడిపించింది. అలా 'బైకర్స్ క్వీన్స్' బృందానికి పునాది పడింది. ఈ బృందం సమాజానికి ఉపయోగపడే పనేదైనా చేయాలని పూనుకుంది. అమ్మాయిలకు చదువు గురించి అవగాహన కల్పించడం, వారి సామాజిక బాధ్యతలు వంటి అంశాల గూర్చి ప్రచారం చేసేందుకు సిద్ధమయ్యారు. సారిక 45 మంది స్నేహితులతో తన బృందంగా ముందుకు సాగింది. వీరంతా కలిసి దేశంలోని అన్నిప్రాంతాలకు, గ్రామాలకు వెళ్లి మహిళలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. అదే లక్ష్యంతో వారి ప్రయాణాన్ని మొదలుపెట్టారు.

'నిజానికి రెండు సంవత్సరాల క్రితంమే తను బైక్ నడపడం మొదలుపెట్టింది. బైకర్స్ క్వీన్స్ స్థాపించిన తర్వాత చాలామంది అమ్మాయిలు ఇందులో పాల్గొన్నారు. బైక్ నడిపే అమ్మాయిలు బృందంగా ఉండగలుగుతారా అనేది చాలామందిలో తలెత్తే చిన్న ప్రశ్న. ఇద్దరు, ముగ్గురు బైకర్లు జట్టుగా వుండడం సహజమే కానీ, ఇంత పెద్ద దళం చూసిన వారికి ఆ డౌట్ రావడంలో తప్పులేదు కదా! వీరంతా హెల్మెట్ తప్పనిసరి అనే నిబంధనకు కట్టుబడి ఉంటారు. రయ్యిమంటూ దూసుకెళ్ళే ఈ బృందంలో వారి

ముఖాలు కనపడకపోవడంతో చాలామంది వాళ్లని పురుషులనే అనుకునేవారట. మహారాష్ట్రలో ప్రయాణిస్తున్నప్పుడు ఓ ప్రాంతం దగ్గర ఆగారు వీళ్లంతా. ఒకతను మెహతా భుజంపై చేయి వేసి నిలబడ్డాడు. తను హెల్మెట్ తీయగానే సారీ మేడం అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడంటూ అప్పటి తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటారు సారికా. గులాబీ రంగును మహిళలు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. అందుకనే మహిళల అభ్యుదయానికి కృషిచేస్తున్న ఈ బృందంలో అందరూ గులాబీ రంగు హెల్మెట్‌ని ధరిస్తారు. సూరత్ నగరం వజ్రాల వ్యాపారానికి పేరుగాంచిన ప్రాంతం. సారికా భర్త కూడా ఈ వ్యాపారం చేస్తుంటారు. సమాజం కోసం ఏదైనా చేయాలని అనుకున్న సారికాకు తన కుటుంబం అంతా అండగా ఉన్నారు. ప్రయాణం చేసేటప్పుడు చాలా సమస్యలనే ఎదుర్కోవలసి వచ్చింది తనకి. కానీ వాటన్నింటిని అధిగమించి ఇంతవరకు చేరుకోవడం ఆనందాన్నిచ్చిందంటారు సారికా. బైకర్స్ క్వీన్స్ సమూహంలో అతిపెద్ద వయస్కురాలు సారికానే. ఈ సమూహంలో 19 సంవత్సరాల వయస్సుగల అమ్మాయిలు ఇద్దరున్నారు. వారే సోనా, కీర్తి. వీళ్లతో సమానంగా తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది సారికా.

మొదటగా సూరత్ నుంచి కాన్పూర్‌కి చేరుకున్నారు. అక్కడ ఓ హోటల్‌లో సమావేశం ఏర్పాటుచేసుకున్నారు. అలా వారి మొదటి ప్రయాణం ఆగ్రా వైపుగా సాగింది. ఈ బృందానికి ఓ యూనిఫామ్ కూడా ఉంది. బ్లూ టీషర్టు, బ్లాక్ ట్రాక్ ప్యాంట్‌ను ధరిస్తారు. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు, ఏ రోజు ఏ ఊరు అని ప్రణాళికను కూడా ముందుగానే సిద్ధం చేసుకున్నారు. దారి మధ్యలో ఎన్ని గ్రామాలు తారసపడితే అన్ని గ్రామాల్లోకి వెళ్లి మహిళలకు అవగాహన కల్పించాలనేది వారి ముఖ్య లక్ష్యం. కన్యాకుమారి నుంచి బైకర్స్ క్వీన్స్ ప్రయాణం ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు మహారాష్ట్రలలోని మారుమూల గ్రామాలకు చేరుకుంది, అక్కడి నుంచి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు వెళ్ళారు.

ఆగ్రా నుంచి చండీగఢ్, అక్కడి నుంచి లక్నో. భారతదేశపు అతి ఎత్తయిన మార్గం లక్నోలో ఉన్న ఖార్‌డుంగ్లా గ్రామం. ఆగస్టు 15న అక్కడే త్రివర్ణపతాకాన్ని ఎగరువేయాలని నిర్ణయించుకుందీ బృందం. దేశంలోని అన్ని ప్రాంతాలను చుట్టేసి సెప్టెంబరులో తిరిగి సూరత్‌కి చేరుకోవాలనేది వారి ప్రణాళిక.

ఈ ప్రయాణంలో వాళ్ళు ఎన్నో గ్రామాలని చుట్టొచ్చారు. ఎన్నో గ్రామాల్లో కరెంటుతో పాటు కనీస సదుపాయాలు కూడా లేవు. కొన్ని గ్రామాల్లో అయితే పిల్లలు చెట్టు కిందే పాఠాలు వింటున్నారు. వీటన్నింటిని ఓ రిపోర్టుగా తయారుచేసిందీ బృందం. తిరిగి సూరత్ చేరుకున్నాక ఈ రిపోర్టును ప్రధానమంత్రికి చేరవేసి, తద్వారా ఆ గ్రామాలకు కనీస సదుపాయాలు చేకూరేందుకు కృషిచేస్తోందీ బైక్‌రేసర్ బృందం.

- అమల తిలారు

నవ్వుల్ - పువ్వుల్

క్రియేటివిటీ

టీచర్ : చెట్టు కింద కూర్చొని న్యూటన్ గురుత్వాకర్షణ శక్తిని కనిపెట్టాడు. దీన్ని బట్టి నీకేమి అర్థమయ్యింది.

చింటు : ఇలా క్లాస్‌లో కూర్చుంటే కొత్త విషయాలు కనిపెట్టలేమని టీచర్.

గుర్తుండిపోయేలా

సుబ్బారావు : ఒరే! మా ఆవిడ పుట్టిన రోజుని నేను ఎప్పుడూ మర్చిపోను తెలుసా?

కాంతారావు : అబ్బ! నువ్వు చాలా గ్రేట్ రా! అంత ఇదిగా ఎలా గుర్తుపెట్టుకుంటున్నావు?

సుబ్బారావు : ఒకసారి పుట్టిన రోజుని మర్చిపోయాను. తర్వాత నాకు జీవితాంతం గుర్తుండిపోయేలాగా ఒక ట్రీట్ ఇచ్చింది. అప్పటి నుండి ఇలా గుర్తుపెట్టేసుకున్నా!...

అతితెలివి



టీచర్ : రాము భూమి గుండ్రంగా వుందనడానికి ఒక కారణం చెప్పు?

రాము : మా నాన్న, మా అమ్మ, నా ఫ్రెండ్ బంటి గాడు ముగ్గురూ అలానే చెప్పారు కాబట్టి.

కిసుక్కు



టీచర్ : ఒరేయ్ చంటి..! నీ కొచ్చింది ఐదు మార్కులు బుద్ధిలేకుండా ఇంకా నవ్వుతున్నావా?

చంటి : నేను రాసింది గబ్బర్‌సింగ్ సినిమాలో పాటకి ఆ ఐదు మార్కులు కూడా ఎలా వచ్చాయో అర్థం కావడంలేదు టీచర్...

టీచర్ : ఆ.....

అభిమాని

తండ్రి : బంటి నీకిష్టమైన రచయిత ఎవరు?

బంటి : జార్జి వాషింగ్టన్ టీచర్.

తండ్రి : అదేంటి జార్జ్ వాషింగ్టన్ ఏ పుస్తకమూ రాయలేదే....

బంటి : అందుకే ఆయనంటే చెప్పలేనంత ఇష్టం నాకు....

తండ్రి : ఆ.....

నిజాయితీ

అమ్మ : చింటు ఎప్పుడూ నిజాలే చెప్పాలి అబద్ధాలు చెప్పకూడదు.

చింటు : మరి నాన్నేంటమ్మా..... పక్కింటి అంకుల్ ఎప్పుడు పేపర్ అడిగినా ఇంకా రాలేదనే చెబుతాడు...

కిసుక్కు సిత్రం



పిల్లి దొంగను కాదు.. ఈ పెన్ను నాదే..!



నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్ : మార్కో మెల్‌గ్రాటి

సేకర్త: పి.బాలు, మచిలీపట్నం

అట్టమీది కథ

ఆ రోజుల్లో.. అండమాన్ జైలు

-అద్దేపల్లి శర్వాణి

స్వాతంత్ర్యం అంటే బానిసత్వం నుండి మనిషి స్వేచ్ఛాజీవి కావడం. భారతీయులు అలా స్వేచ్ఛా జీవుల్లా మారాలని ఎంతోమంది పోరాటాలు ఉద్యమాలు త్యాగాలు చేశారు. వలస పాలనల నుండి విముక్తి కోసం భారత్‌లో మొదలైన స్వాతంత్రోద్యమంలో ఎంతో మంది కమ్యునిష్టులు పాల్గొన్నారు. తమ ప్రాణాలకు తెగించి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. అలా స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి జీవితంలో అంతిమ ఘట్టాలు కారాగారాలతో ముడిపడి వుండేవి. స్వాతంత్రోద్యమంలో విప్లవకారులు ఎలాంటి తీవ్ర పరిస్థితులని ఎదుర్కొన్నారో వాటి కంటే ఎక్కువ హింసని అండమాన్ సెల్యులర్ జైలు ఖైదీలుగా అనుభవించారు. స్వాతంత్రోద్యమంలో అండమాన్ వీరులదో ప్రత్యేక అధ్యాయం. ఆ సెల్యులార్ జైల్‌ది ఓ భయంగొలిపే చరిత్ర. అక్కడ అమరులైనవారు, తిరిగి దేశ సంస్కరణకు కదిలినవారి త్యాగాల్ని గౌరవించుకుంటూ ఇప్పటికీ అండమాన్ జైల్‌ను సందర్శిస్తూ దాన్నో అమర కేంద్రంగా భావించేవాళ్లు చాలామందే. దానికి సంబంధించిన కొన్ని వివరాలు ఈ వారం అట్టమీది కథలో.

బ్రిటీషు పాలనకి వ్యతిరేకంగా పోరాటం చేసినవారిలో చాలామంది చివరి జీవిత ఘట్టాలు ఈ జైలుతోనే ముడిపడి వుండేవి. తొలి స్వాతంత్ర్య సంగ్రామం నాటికే ఉద్యమకారులని బంధించి దేశానికి సుదూరంగా వున్న అండమాన్ దీవుల్లో ఖైదీలుగా వుంచేవారు. దేశభక్తి మెండుగా వున్న ఈ ఖైదీలందరూ ఈదుకుంటూ దేశానికి తిరిగొచ్చే సాహసానికి ఒడిగట్టడంతో మరింత భద్రత కోసం సెల్యులార్ జైలు నిర్మాణం జరిగింది. సెల్యులార్ జైల్‌కి 'కాలా పానీ' అనే పేరుంది. కాలా అంటే నలుపు. దీవుల్లో నిర్మించడంతోపాటు అత్యంత చీకట్లని అలుముకుని వుండే జైలు నిర్మాణం కారణంగా సెల్యులార్ జైల్‌కి ఆ పేరొచ్చింది. అప్పటి వలస పాలనల్లో బానిసలతోపాటు బ్రిటీషువారికి వ్యతిరేకంగా నినాదాలు చేసే రాజకీయ ఖైదీలని ఎక్కువగా అండమాన్‌లోని ఈ జైలుకి తరలించేవారు. బెంగాలీ కమ్యూనిస్ట్ విప్లవకారుడు సుధాంసుదాసు గుప్త, బటుకేశ్వర్ దత్, చిట్టగాంగ్ విప్లవవీరులు గణేష్ ఘోష్, అనంత సింగ్, సుభోద్ రాయ్ వంటి ఎంతో మంది స్వాతంత్రోద్యమ సమయంలో ఇక్కడే ఖైదులుగా మరణించారు.

సెల్యులర్ ఏర్పడిందిలా

అప్పట్లో అండమాన్ అంటే గుబులు పుట్టేది. ప్రధాన భూభాగానికి సుదూరంగా మహా సముద్రం మధ్యనుండే చిన్న చిన్న ద్వీపాలు. అరణ్య వాతావరణం. ఇవన్నీ కూడా అండమాన్ దీవుల్ని కారాగార కేంద్రాలుగా మార్చడానికి ఉపయోగపడ్డాయి. మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా ఒంటరిగా ఉండేవి. ఆదివాసీల వల్ల ఏ లాభం ఉండేది కాదు. ఒక్కసారి అక్కడకు ఖైదీగా వెళితే నరకకూపంలోకి అడుగుపెట్టినట్టే. అక్కడ జరిగే అకృత్యాలు బాహ్య ప్రపంచానికి తెలిసే అవకాశమే ఉండేది కాదు. తెగించి ఎవరన్నా ఖైదీలు సముద్రంలోకి దూకి ఈదే సాహసం చేసినా తర్వాతి దీవి ఒడ్డుకు చేరేసరికి ప్రాణాలు విడిచేవారు. ఎవరన్నా ఒడ్డు చేరినా అక్కడి విష సర్పాలు, కీటకాలు, మృగాల బారిన పడేవారు. వైరల్ రోగాలు రోజుల్లో ప్రాణాల్ని తీసేసేవి. నాగరికతకు సంబంధించి ఏ ఆనవాలూ కనిపించని ఆ దీవులు ఖైదీలకు తప్పించుకునే అవకాశమివ్వవు. అయినా కొందరు దేశభక్తులు ప్రాణాల్ని లెక్కచేయకుండా తప్పించుకునే

ప్రయత్నాలు చేయడంతో బ్రిటిష్ ప్రభుత్వం అంతకు ముందు ఎక్కడా చూడని ఓ పాశవిక జైలు నిర్మాణానికి సిద్ధపడింది. చీకటిలోనే ఖైదీ జీవితం ముగిసిపోయేలా రూపకల్పన చేశారు.

జైలు విభాగాల నుంచి గదుల వరకు ప్రతి చోటా ఖైదీ దుస్థితి కనిపిస్తుంది. అండమాన్

సెల్యులార్ జైల్ నిర్మాణం 1896లో ప్రారంభమై 1906లో పూర్తయ్యింది. బర్మా నుండి తెప్పించిన ముదురు ఎరుపు, ఊదా రంగు ఇటుకలని ఉపయోగించి చేసిన ఈ భవన నిర్మాణం భీతిగొలుపుతుంది. ఒక చక్రం ఆకారంలో వుండే ఈ భవనంలో ఏడు విభాగాలుగా భవనాలని నిర్మించారు. ఈ భవనాలకి మధ్య భాగంలో ఒక టవర్‌ని ఏర్పాటు చేశారు. 18 శతాబ్దానికి చెందిన తత్వవేత్త జెర్మి బెంథెమ్ 'పనాప్టికాన్' నిర్మాణ శైలి ఆధారంగా నిర్మించిన ఈ సెల్యులార్ జైలులో టవర్ వద్ద నుండి ఖైదీలను గమనిస్తుంటారు. కాపలాకు నిరంతరం ఒక గార్డు పనిచేస్తుంటాడు. ఈ టవర్ మధ్యలో ఒక పెద్ద గంట అమర్చబడి వుంటుంది. ఏడు విభాగాలున్న ఈ జైలులో ఒక్కో విభాగంలో మూడంతస్తులుంటాయి. ఎలాంటి పడక సదుపాయం లేకుండా వుండే గదులు కొన్నైతే, కొద్దిపాటి సదుపాయలతో వుండే గదులు మరికొన్ని. ఏడు

తప్పించుకునే దారి లేకుండా...



విభాగాల్లో మొత్తం 696 గదులని నిర్మించారు. 4.5 నుండి 2.7 మీటర్ల పరిమాణంలో ఉండే ప్రతి జైలు గదిలో 3 మీటర్ల (9.8 అడుగులు) ఎత్తులో ఉన్న వెంటిలేటర్లని అమర్చారు. ఈ గదుల్లో ప్రవేశించడం కూడా చాలాకష్టంగా వుంటుంది. ఒక్కో గదిలో ఒక్క ఖైదీని మాత్రమే వుంచేవారు. ఏ ఖైదీ మరో ఖైదీతో మాట్లాడే వీలు లేకుండా వుండేలా జైలు గదులని నిర్మించారు. ప్రతి జైలు గది ప్రవేశ ద్వారం ఊచలు మరో ఖైదీకి కనిపించవంటే ఎంత జాగ్రత్త తీసుకున్నారో అర్థమవుతుంది. ఏ ఒక్కరూ మరొకరికి కనిపించకుండా వుండే ఈ నిర్మాణం ఖైదీలను తీవ్ర ఒంటరితనానికి గురిచేసేది. ఇలా ఇక్కడ చోటుచేసుకున్న ప్రతి నిర్మాణం గగుర్పాటుకు గురిచేస్తుంది. సెల్యులర్ జైలు నిర్మాణం ఖైదీల మధ్య సంభాషణ అసాధ్యం చేసింది. నిర్బంధ ఖైదీలని పూర్తిగా ఒంటరితనంలోకి నెట్టివేసిందనే చెప్పాలి. ఏడు విభాగాలుగా వున్న ఒక్కో బ్లాక్ సెంట్రల్ టవర్‌కి అనుసంధానంగా వుండేలా ఒక బ్రిడ్జ్‌ని ఏర్పాటు చేశారు. జైలు అధికారులు మాత్రమే ఉపయోగించే ఈ బ్రిడ్జి ప్రవేశం రాత్రి సమయంలో మూసివేయబడేది. దీని ద్వారా ఒక్కో విభాగానికి రాకపోకలని పూర్తిగా నివారించబడేవి. ప్రతి నెల ఖైదీలని వేరువేరు విభాగాల్లోకి పంపుతుండేవారు. ఏ ఒక్కరి మధ్యా స్నేహ సంబంధాలు మెరుగవకుండా వుండేందుకు ఇలాంటి మార్పులని చేసేవారు.

దీవుల్లోని సెల్యులర్ జైల్ 1896-1906 మధ్య నిర్మించబడింది. అయితే 1857లో చోటుచేసుకున్న సిపాయిల తిరుగుబాటు అనంతరం బ్రిటిష్ వాళ్ళు ఈ జైలుని ఉపయోగించడం మొదలుపెట్టారు. తిరుబాటుదారులని అణిచివేస్తున్న రోజులవి. అప్పటికే సామ్రాజ్యవాదులు జరిపిన అమానుష దాడులకి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది ఖైదీలుగా మారారు.



ఖైదీలుగా వున్న కొందరు జైళ్ళలోనే బ్రిటిష్ పాలకుల దురాగతాలకి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. వారి చెప్పుచేతుల్లో వుండటానికి తిరస్కరించారు. దీని కంటే ప్రాణత్యాగమే మంచిదనే నినాదాలు ఎక్కువగా వినపడుతుండేవి. ఈ దాస్యశృంఖలాలని ఖైదీలు బద్దలుకొట్టుకు రాకముందే జాగ్రత్తపడాలనే ఆలోచన బ్రిటిష్ అధికారుల్లో మొదలయ్యింది. భారత్‌కి సుదూరంగా వుండే అండమాన్ ఈ ఖైదీలను వుంచేందుకు అనువైన ప్రదేశంగా నిర్ణయించారు. డేవిడ్ బ్యారి, మేజర్ జేమ్స్ ప్యాటిసన్ వాల్కర్ నేతృత్వంలో తొలిసారిగా ఆగ్రాలోని 200 మంది ఖైదీలని ఇక్కడికి తరలించారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున ఇక్కడికి తరలించబడింది 1868లో కరాచీ ప్రాంతానికి చెందిన 733 మంది ఖైదీలని. మొఘల్ రాజకుటుంబాలకి చెందిన వారితోపాటు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేసిన వారిని ఇక్కడకు తరలించారు. ఉద్యమాలు జరిగే ప్రధాన భూభాగానికి సుదూరంగా ఓ ప్రాంతం అంతకు మించి ఇక్కడి చేరుకోవడానికి చేసే ప్రయాణం అన్నీ భయాందోళనలకి గురిచేసేవే. ప్రజల్లో బ్రిటీషుపాలనపై వెల్లువెత్తుతున్న వ్యతిరేక ధోరణులని అణచివేసేందుకు ఇదే సరైన ప్రదేశంగా తోచింది. 20వ శతాబ్దపు తొలినాళ్ళకే ఈ వ్యతిరేక భావనలు మరింత ఎక్కువవడంతో స్వాతంత్రోద్యమం ఊపందుకుంది. అలా భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో తిరుగుబాటు చేసిన, విప్లవాలను ప్రారంభించిన ఖైదీలను మరింత పటిష్టతతో అండమాన్‌కి తరలించేవారు. అక్కడ కూడా కట్టుదిట్టమైన ఆంక్షలే వుండేవి. ఒకదశలో ఖైదీలని తీవ్రమైన ఆంక్షలకు గురిచేసే 'శిక్షాస్మృతి' దశవుండాలనే లెత్ బ్రిడ్జ్, ల్యాల్ సిఫార్సుల మేరకు సెల్యులార్ జైల్ నిర్మాణం జరిగింది. ఒంటరితనాన్ని చొప్పించే ఒక మారుమూల నిర్మాణంగా దీన్ని చరిత్రకారులు చెప్పుకొచ్చారు.

ఖైదీల జైలు జీవితం

ప్రతి రోజు ఆరు గంటలకు ఖైదీలని వుంచిన గదులు తెరవబడేవి. ఏడు గంటలకి జైలు ఆవరణలో వున్న ఖాళీ ప్రదేశానికి ఖైదీలు చేరుకునేవారు. గుట్టలుగా వుంచిన కొబ్బరి పీచుని తాళ్లలా పేనే పనిని కొత్తగా వచ్చే ఖైదీలందరి చేతా చేయించేవారు. గంటల తరబడి తాళ్లు పేనడంతో ఖైదీల చేతులు ఉబ్బుకొచ్చేవి. అవి పూర్తిగా మానకుండానే మరుసటి రోజు మళ్ళీ తాళ్ళని పేనడం కఠినమైన శిక్షల్లో భాగంగా వుండేది. జైలు

ఆవరణలోని ఒక్కో విభాగం వద్ద ఒక వర్క్‌షెడ్ వుంటుంది. ఇక్కడ అమర్చబడిన గానుగ పరికరాల్ని ఖైదీలే తిప్పాలి. ఓ ఎద్దు చేసే పనిని ఓ ఖైదీ వద్ద ఆశించేవారు. గింజల నుంచి నూనెని తీసేందుకే ఖైదీలు ఎక్కువగంటలు పనిచేయాల్సి వచ్చేది. రోజుకు ముప్పై పౌండ్ల కొబ్బరినూనె, 10 పౌండ్ల ఆవనూనెను తయారుచేయని ఖైదీలని జైలు అధికారులు కఠినంగా శిక్షించేవారు. సెల్యులర్ జైల్లో వుండే కొందరు ఖైదీలు ఒంటరితనంతోపాటు జైలు అధికారుల శిక్షలను భరించలేక ఒక దశలో ఇక్కడి నుండి బయటపడే ఆలోచనలు చేశారు. 1868 మార్చ్‌లో దాదాపు 238 మంది ఖైదీలు ఇక్కడి నుండీ పారిపోయేందుకు ప్రయత్నించారు. జైలు నుండి కొద్ది దూరం బయటికొస్తే చాలు నాలుగు పక్కలా సముద్రమే తప్పా మరే ఇతర రవాణా మాధ్యమాలు కనిపించవు. అలాంటి చోట ఈదుకొనైనా సరే జైలు నుండి బయట పడేందుకు ప్రయత్నించారంటే ఇక్కడ వారు అనుభవించిన శిక్షల తీవ్రత ఎంత అనే విషయం అర్థమవుతుంది. అయితే ఒక నెలలోపే అంటే ఏప్రిల్ నెలలో జైలు నుండి పారిపోయేందుకు ప్రయత్నించిన ఖైదీలందరినీ పట్టుకోవడం జరిగింది. వీరిలో ఒకరు ఆత్మహత్యచేసుకున్నారు. మిగిలిన వారిలో దాదాపు 87 మందిని అప్పటి జైలు సూపరింటెండెంట్ అదేశానుసారం ఉరి తీశారు.

ప్రజావిప్లవ పంథా

20వ శతాబ్దపు బ్యాస్టిల్ అండమాన్ సెల్యులార్ జైలు 1933 మధ్య నుండి మార్క్సిజం, లెనినిజాన్ని బోధించే విద్యా కేంద్రంగా రూపుదాల్చింది. ఈ విద్యా సంస్థకు అధ్యాపకుడు/నాయకుడు నారాయణ్‌దా. అలా 20వ శతాబ్దపు బ్యాస్టిల్ మార్క్సిజం- లెనినిజం నేర్పిన విద్యాకేంద్రంగా మార్పు చెందడానికి కారణం. అందుకు లభించే పూర్తి గౌరవం అక్కడ ఖైదీలుగా వున్న విప్లవకారులకే దక్కుతుంది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకి ఉమ్మడి బెంగాల్ శాఖకు చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు దీనిలోనే మార్క్సిజం-లెనినిజం గురించిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. వారిలో చిట్టగాంగ్ తిరుగుబాటు దారులైన ఖైదీలలో మెజార్టీ గణేష్‌దా (కామ్రేడ్ గణేష్ ఘోష్) నాయకత్వాన కమ్యునిజాన్ని అంగీకరించారు. ఇలా ఖైదీల్లో మధ్యతరగతి హింసావాద విప్లవ పథం నుండి చాలామంది వైదొలగడానికి కొత్తయుగం ప్రజావిప్లవ పంథాను చేపట్టడానికి మార్క్స్, లెనిన్, ఎంగెల్స్ రచనలు తోడ్పడ్డాయి. 1964లో కలకత్తాలో జరిగిన ఏడవ మహాసభలో ఏర్పడిన సి.పి.ఐ(యం)లో చేరారు. కామ్రేడ్ సతీష్ పక్రాషీ, నిరంజన్‌సేన్, హరేకృష్ణ కోనార్, సుబోధ్ చౌదరి, బంగ్లాదేశ్‌కు చెందిన నళినీదాస్‌లు ఈ విద్యాకేంద్రంలో విద్యార్థులు. అంతేకాక పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ గణేష్ ఘోష్ , సుకుమార్‌సేన్, అమృతేంద్ర ముఖర్జీ, సి.పి.ఐ.ఎం ఉత్తరప్రదేశ్ నాయకులుగా పనిచేసిన కామ్రేడ్ శివవర్మ, పశ్చిమబెంగాల్ రాష్ట్ర కమిటి ఆఫీసు కామ్రేడ్ సుబోధ్‌రాయ్‌లు కూడా ఈ కేంద్రంలో విద్యార్థులనే చెప్పాలి. అయితే 1934లో జైలు శిక్ష ముగియడంతో చాలామందికి దీర్ఘకాలం ఇక్కడ అధ్యయనం చేసేందుకు వీలుపడలేదు. దేశ స్వాతంత్ర్యం అనంతరం అండమాన్ సెల్యులర్ జైలు ఒక చారిత్రక మ్యూజియంగా చరిత్రలో చిరస్మరణీయంగా వుండిపోతుందనుకున్నారు. కానీ ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల వల్ల జైలులో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. సెల్యులర్ జైలులో ఖైదీలుగా వున్న విప్లవకారుల్లో కొందరు ఒక బృందంగా ఏర్పడి 1969లో ఈ జైలుని సందర్శించారు. అయితే అక్కడ వారికి కొన్ని ఆశ్చర్యకరమైన దృశాలు కనిపించాయి. సెల్యులర్ జైలులో అతి ప్రధానమైన ఒక భాగం పూర్తిగా అక్కడ లేకుండా పోయింది. కొన్ని నిర్మాణాలు ధ్వంసం చేయబడి వున్నాయి. ఆ దృశ్యాలకి చలించిన ఆ బృందం ఆందోళన చేసింది. వాటి ద్వారా జైలులోని మిగిలిన భాగాలు పరిరక్షించబడ్డాయి. ఖైదీలుగా వున్న వారి ఫోటోలు గేటు వద్ద వేలాడదీయడంతో పాటు ఖైదీల పేర్లను మధ్య వున్న గోపురం (సెంట్రల్ టవర్) మీద చెక్కారు. తర్వాతి కాలంలో అక్కడే జిల్లా జైలు ఆఫీసులు, ఆస్పత్రిని నిర్మించారు.



1933 నాటికి సెల్యులార్ జైల్‌లో పెద్దఎత్తున హంగర్ స్ట్రైక్‌లు మొదలయ్యాయి. నిరశనల్లో పాల్గొన్న వారిలో 33 మంది జైలు అధికారుల చేత తీవ్రంగా శిక్షించబడ్డారు. వీరిలో ముగ్గురు ఖైదీలు మరణించడంతో ఖైదీల నిరసన మరింత తీవ్రమైంది. ప్రముఖ ఉద్యమకారుల జోక్యంతో రాజకీయ కారణాలతో ఖైదీలుగా వున్న వారిని సెల్యులార్ జైల్ నుండి మరొక భవనంలోకి మార్చినా చాలామంది దేశభక్తులు ఆ చీకటి గదుల్లోనే జైలు సిబ్బంది దారుణాలకు బలైపోయారు.

సైనిక దుర్గం

అండమాన్ 'సెల్యులర్ జైలు'ని ఇరవయ్యో శతాబ్దపు సైనిక దుర్గం (బ్యాస్టిల్)గా కొందరు చరిత్రకారులు భావించే వారు. నిజానికి సెల్యులార్ జైలుకి బ్యాస్టిల్‌కి కాస్త దగ్గరి పోలికలే ఉంటాయి. ఈ సైనిక దుర్గం తూర్పు ఫ్రాన్స్‌లోని ఫ్రెంచి రాజుల సైనిక కోట. అప్పటి ఫ్రెంచ్ విప్లవ యోధులను కోటలోనే ఖైదీలుగా పెట్టారు. ఖైదీలుగా వున్న విప్లవకారులపై అమానుషమైన హింసాకాండ సాగించబడిన కేంద్రంగా పేరొందింది. 1789 జులై 14న దుర్గమమైన ఈ కోటని ధ్వంసం చేయడంతో 1789లో ఫ్రెంచి విప్లవం ప్రారంభమైంది. ఇక అండమాన్ సెల్యులర్ జైలు కూడా భారత దేశంలో ఖైదు చేయబడిన

బెంగాలీల బంగ్

అండమాన్‌కి పంపబడేవారందరినీ ముందుగా అలీపూర్‌కు తీసుకొచ్చేవారు. ఇక్కడ సెంట్రల్ జైలులో బెంగాలీలని ఒక గదిలో వుంచుతారు దానిపేరే బంగ్. ఇక్కడికి వచ్చే వారిలో ఢాకా జైలు నుండి వచ్చేవారు కూడా ఎక్కువే. అండమాన్‌కి చేరవేసిన ఈ ఖైదీలు పుస్తకాలు చదువుకునేవారు. అక్కడున్న 'బుక్ కంపెనీ' పుస్తక విక్రయ షాపులో పుస్తకాలని కొనుక్కోవాల్సి వుంది. అప్పట్లో అక్కడ అభ్యుదయ పుస్తకాలు దొరికేవికావు. కావాల్సిన పుస్తకాలతో ఒక జాబితాని తయారుచేసి ఈ షాపుకి పంపేవారు ఖైదీలు. షాపు నుండి జైలు అధికారులకి ఆ జాబితా వచ్చేది. ఆ తర్వాత అధికారులు ఆమోదించిన పుస్తకాలనే చదుకోవల్సిన పరిస్థితులూ ప్రారంభమయ్యాయి.

సెల్యులార్ జైల్లో వున్న విప్లవకారుల్లో అబనీఘోష్, సునిర్మల్ సేన్, బంగేశ్వరరాయ్, గోపాల్ ఆచార్య, సుధాంసు దాస్ గుప్తల మధ్య స్నేహ బంధం ఏర్పడింది. జైల్లో తాడు పేనడం దగ్గర మొదలైన ఈ బంధం విప్లవం దిశగా చర్చలు కొనసాగించే దశకు చేరుకుంది. తాడు పేనే బాధల నుండి కాస్త ఉపశమనం కోసం కొత్త ఆలోచనలు చేయడం మొదలు పెట్టారు. అలా ఓ రోజు అబనీ ఘోష్ లిఖిత పత్రికను మొదలు పెట్టాలనే తన ఆలోచనని బైటపెట్టాడు.

తొలి లిఖిత పత్రిక

అయితే మిగిలినవారు ఎవ్వరూ దీనికి ఏమీ మాట్లాడలేకపోయారు. ఎందుకంటే తమ శక్తి సామర్థ్యాలు అందుకు సరిపోతాయో లేదో అనే చిన్న అనుమానం వారిలో వుండేది. దీంతోపాటు పత్రిక పేరు ఏం పెట్టాలి? దీనిని ఎవరు ఎడిట్ చేయాలి? అనే చర్చలు మొదలయ్యాయి. మరుసటి రోజు 'నిర్వాసిత' అనే పేరు అబనీఘోష్ ద్వారా సిఫార్సు చేయబడింది. అలా ఈ ఐదుగురే 'నిర్వాసిత'ని నిర్వహణ బాధ్యతలని తీసుకున్నారు. 'రోజంతా తాడు పేనుతూనే వున్నాం' అనే శీర్షికతో ఒక హాస్య పూరిత వ్యాసాన్ని అబనీ దా రాశాడు. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా 'ఇరవయ్యో శతాబ్దపు మహాభారతం ఒక పెద్ద దెబ్బ కొట్టింది' అనే నిర్మల్ దా వ్యాసంతోపాటు మిగతా ముగ్గురు రాసిన కథలు, గేయాలతో మొదటి లిఖిత పత్రికగా 'నిర్వాసిత' మొదటి సంచిక 1933 జనవరిలో వెలువడింది.

విప్లవకారులపై హింసాకాండ సాగించేందుకు నిర్మించబడింది. భారత దీర్ఘకాల పోరాటంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని అండమాన్ ఆక్రమించుకుంది. అండమాన్‌కి నడిబొడ్డున వున్న పోర్టుబ్లెయిర్‌ను ప్యానెల్ సెటిల్‌మెంటుగా ఉంచాలని 1858లో మొట్టమొదటిసారిగా పథకం మొదలయ్యింది. అదే సంవత్సరం వందలాది రాజకీయ ఖైదీలను చంపేయాలనే ఉద్దేశంతో వారిని బలవంతంగా అండమాన్‌కు తరలించారు. అలా అండమాన్‌కి బలవంతంగా పంపబడిన బ్రిటిష్ వ్యతిరేక రాజకీయ ఖైదీలెవ్వరూ సజీవంగా తిరిగి భారత్‌కు చేరుకోలేదనే ప్రచారం వుంది. ఇలాంటి ఘటనలకి రుజువులు కూడా లేవు. అయితే లెక్కలేనంత మంది స్వాతంత్ర్య సమరయోధుల శరీర శిథిలావశేషాలు అండమాన్ చుట్టూ వున్న సముద్రపు నీటిలో కనిపించేవనేది ప్రచారంలో వుంది. అండమాన్‌లో, ఆ తర్వాత సెల్యులార్ జైలులో సామ్రాజ్యవాద ముష్కరుల చేతుల్లో స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణాలర్పించడమో, హింసాకాండకో గురయ్యారనేది వాస్తవం. అయితే ఇరవయ్యో శతాబ్దంలో స్వాతంత్ర్యం రావాలని కోరుకున్న రాజకీయ 'దేశభక్తుల'లో చాలామందిని సామ్రాజ్యవాద ప్రభుత్వం అండమాన్‌కి పంపించలేదు. కేవలం స్వాతంత్ర్య పోరాటాన్ని విప్లవ పంథాలో నడిపినవారి మీదే ఎక్కువ దృష్టి పెట్టింది. తిరుగుబాటుదారులు, విప్లవకారులకు మాత్రమే కారాగారవాసంగా అండమాన్ ఉండేది. జైలు నిర్మాణం 1910 నాటికి పూర్తయినా 1897 నుండే రాజకీయ ఖైదీలను ఇందులో కుక్కేందుకు ఏర్పాట్లు జరిగాయి. 1933 వరకు అనేక మంది రాజకీయ ఖైదీలను బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులు జైలులో తీవ్రంగా శిక్షించి చంపేశారు. కొన్ని వందల మంది రాజకీయ ఖైదీలపై జరిగిన హింసాకాండకు జైలు అణువణువూ సాక్ష్యంగా నిలిచింది.

రెండో ప్రపంచ యుద్ధంలో ఓసారి అండమాన్ జపనీయుల చేతుల్లోకి వెళ్లింది. ఆ తర్వాత మళ్లీ బ్రిటిష్ సేనలు చేజిక్కుంచుకున్నాయి. ఈ యుద్ధ సంక్షోభ తాకిడి ఖైదీలపై తీవ్రంగా పడింది. భారత్‌కు స్వాతంత్రం లభించిన అనంతరం ఈ జైల్లోని రెండు విభాగాలు పూర్తిగా కూల్చివేయబడ్డాయి. సెల్యులార్ జైల్ ఆవరణలో 1963లో ఒక వైద్యశాలని నిర్మించారు. 500 పడకలు కలిగిన ఈ ఆస్పత్రిలో ఇప్పుడు దాదాపు 40కిపైగా వైద్యులు సేవలందిస్తున్నారు. మిగిలిన మూడు విభాగాలతోపాటు సెంట్రల్ టవర్‌ని 1969లో జాతీయ మెమోరియల్‌గా తీర్చిదిద్దారు. 2006లో ఈ అండమాన్ జైలు సెంటినరీని పూర్తిచేసుకుంది. ★



అండమాన్‌కి పంపేదిలా....

ఆలీపూర్ జైలు నుండి అండమాన్‌కి ఖైదీలనూ తరలించడం ఉదయం 8 గంటలలోపే మొదలవుతుంది. ఇక్కడి జైలు ప్రధాన గేటు వద్దకి తీసుకొచ్చే ముందే ఖైదీల కాళ్ళకు ఇనుపగొలుసులను బిగిస్తారు. జైలు నిబంధనల ప్రకారం భయంకరమైన శిక్షలను పొందాల్సిన ఖైదీలకి ఇలా గొలుసులని కట్టేవారు. తప్పించుకునిపోకుండా వుండేదుకు ఇలాంటి పద్ధతుల్నే అవలంబించేవారు. బంగాళాఖాతం దాటి అండమాన్‌కి వెళ్ళడానికి ఓడలో ప్రయాణించాల్సి వుంది. నిజానికి ఓడలో నుంచి తప్పించుకు పారిపోవడం ఎవరికైనా అసాధ్యమే!.. పొరపాటున ఓడలోంచి దూకితే ఇక మృత్యువు కోరల్లోకి వెళ్ళినట్టే. ఇవన్నీ తెలిసే.. ఖైదీలని శిక్షించేందుకు వారిని గొలుసులతో నిర్బంధించి మరీ ఓడలోకి ఎక్కించేవారు. రెండు ఇనుప కడ్డీలు ఒకవైపు గొలుసులతో కాళ్ళకి బంధనాలుగా కట్టబడివుంటాయి. కాలుకదిపేందుకు కష్టమయ్యేలా వుండే గొలుసులతో వున్న ఖైదీలని విచక్షణారహితంగా లాగుతూ ఒక వ్యాన్‌లోకి ఎక్కిస్తారు. 'ఖైదీలని తరలించేందుకు ఉపయోగించే ఓడ వద్దకి ఈ వ్యాన్ అందర్నీ చేరుస్తుంది. 'మహారాజ్', 'షాజహాన్' అనే రెండు ఓడల్ని ఉపయోగించేవారు.

ఈ రెండు ఓడలూ కోల్‌కత, చెన్నయ్, రంగూన్‌లకు వచ్చిపోయేవి. అయితే వీటిలో 'మహారాజ్' ఓడని మాత్రమే ఖైదీలని తరలించేందుకు ఉపయోగించేవారు. వ్యాన్‌లో ఓడ వద్దకు తీసుకెళ్ళిన ఖైదీలని ఓడ పైభాగంలో వున్న ఒక ఇరుకు కేబిన్‌లోకి తోసేవారు. మూడు రాత్రుల ప్రయాణంలో మహారాజ్ అండమాన్‌కి చేరుకునేది. కాళ్ళకి బిగించిన గొలుసుల వల్ల ఓడలో కూర్చోవాలన్నా, నిద్రించాలన్నా ఖైదీలు చాలా అసౌకర్యానికి గురవ్వాల్సిందే.. ఈ విధానాలకి తీవ్ర వ్యతిరేకత రావడంతో తర్వాతి కాలంలో ఖైదీలను గొలుసులతో నిర్బంధించే విధానాల్లో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి.

మరీ చింపిరి

ఈ బుడ్డదాని జుట్టు చూశారా! షాక్ తగిలితే నిక్కబొడుచుకున్నట్టు లేదూ. ఇదేమీ కొత్త స్టైలూ కాదూ... ఆ అమ్మాయికి షాకూ తగల్లేదు. ఇదో జన్యుపర సమస్య. వెంట్రుకల్లోని తేడాల వల్ల ఇలా కొయ్యబారిన జుట్టు వస్తుందట. ఇలాంటి సమస్య ఉన్నోళ్లు ప్రపంచంలో ఓ వందమంది ఉంటారేమో అనే అంచనా ఉంది. చూడ్డానికి వింతగా ఉన్న మరీ చింపిరి జుట్టు వల్లే ఏడేళ్ల షిలా యిన్ ఇప్పుడో బుల్లి సెలెబ్రిటీ అయిపోయింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ అమ్మాయి జుట్టు పోగు చూసి వేలాదిమంది ఫాలోవర్లు పోగయ్యారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు చెందిన ఈ పాపకు 3 నెలలుండగానే జుట్టు వెరైటీగా పెరగడం తల్లిదండ్రులు గమనించారు కానీ ఏదో తలంటితే పోతుందిలే అనుకున్నారు. షిలాకు నాలుగేళ్లు వచ్చేనాటికి అది మరీ అస్తవ్యస్తంగా పెరగడంతో తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు పడి జుట్టుకు ముడి వేసేవారు కానీ చూడ్డానికి బాగుండేది కాదు. ఇక అప్పట్నుంచి అలా జుట్టును స్వేచ్ఛగా వదిలేయడం మొదలెట్టారు. ఇలా రోజూ పాఠశాలకు వెళు తుండటంతో షిలాను చూసి నవ్వేవాళ్లు ఎక్కువవుతారనుకున్నారు కానీ వావ్ అంటూ చుట్టూ తిరిగేవాళ్లు ఎక్కువయ్యారు. ఇక అదో స్టైల్ అయిపోయింది. టీచర్లకు అసలు విషయం చెప్పి తల్లిదండ్రులు ఆ విషయంలో అంత పట్టించుకోకుండా చూశారు. స్కూల్లోనే అంత క్రేజ్ వస్తే ఇక ప్రపంచానికి పరిచయం చేస్తే అన్న ఆలోచనతో ఇన్‌స్టాగ్రామ్‌లో కూతురి ఫొటోలను ఉంచుతున్నారు. అలా వదిలేశారేంటని అనుకోకండి ఆమె జుట్టును ఆ మాత్రం సరిదిద్దడానికే అరగంటకు పైగా పనిపడుతుందట.



వింత లోకం



రోజా 1885

మీ ఇంట్లో రోజా చెట్టు ఎప్పటిది? ఇది మాత్రం 1885 నాటిది. అందుకే అస్సలు గులాబీల చెట్టులా అనిపించదు. మరేదో చెట్టులో రోజా పూలు పూస్తున్నాయని భ్రమ పడతాం. 9000 చదరపు అడుగుల్లో విస్తరించిన ఈ భారీ రోజా గుంపును టోంబ్‌స్టోన్ రోజ్ మ్యూజియంగా పిలుస్తారు. అవును సజీవ మ్యూజియంగా దీన్ని చూస్తున్నారు. చెట్టు కాండం 12 అడుగుల చుట్టుకొలత కలిగి ఉంటుంది. శతాబ్దంన్నర క్రితం నాటి ఈ చెట్టు ఇప్పటికీ ప్రతి వసంతంలోను విరబూస్తుంది. స్కాట్‌ల్యాండ్ నుంచి అరిజోనాకు తెచ్చి వేసిన ఓ మొక్క ఇంత పెద్దదైంది. గని కార్మికుడు హెన్రీ గీ తన భార్య మేరీతో కలసి అమెరికాకు వచ్చేసినపుడు వారెంట ఈ మొక్క గుర్తుగా తెచ్చుకుని నాటారు. మరో మొక్కను మిత్రురాలికిచ్చారు. అలా కొన్ని మొక్కల్ని ఆ ప్రదేశంలో నాటగా ఆ తర్వాత అదో పెద్ద గులాబీ తోటలా మారిపోయింది. ఇది తర్వాతర్వాత అతి పెద్దగా ఎదిగి 'రిప్లీస్ బిలీవ్ ఇట్ ఆర్ నాట్', గిన్నిస్ బుక్‌ల్లోను ఎక్కేసింది. దీనికే ప్రత్యేక గులాబీ ఉత్సవాన్ని జరుపుకుంటారు స్థానికులు. కొన్ని వీధుల ముందు నుంచే కమ్మటి గులాబీల సువాసన వెదజల్లడంతో వేలాది మంది ఉత్సవాల్లో సందడి చేస్తారు.



వారానికి 150

యూకేకు చెందిన డేన్ నాష్ అనే కుర్రోడికి అరటి పళ్లు ఉంటేనే పూట గడుస్తుంది. వారానికి 150 పళ్లతో పసందైన విందులా లాగించేస్తున్నాడు. తను తినే తిండిలో అరటి పళ్లది 80 శాతం వాటా. రెండేళ్ల నుంచి ఇలా అరటిని ఆరగిస్తున్నాడు. అప్పుడప్పుడూ ఇష్టం లేకున్నా అన్నం ముద్ద మింగుతున్నాడులెండి. తోటకూర మిగతా ఆకు కూరలు, బెర్రీల్ని చప్పరిస్తుంటాడు కూడా. ఇలా మొత్తానికి రోజులో 3000 కేలరీల్ని కొలత వేసుకుని మరీ తీసుకుంటున్నాడు. ఇదంతా ఎందుకంటే తనకో దురద సమస్య ఉంది. అది స్పైసీ ఫుడ్డూ జంక్ ఫుడ్ వల్ల మరింత ఎక్కువవుతుందని అనుకున్నాడు. అందుకే వాటిని తన మెనూలోంచి కడిగిపారేసి అరటి పండును ఒలుస్తున్నాడు. వైద్యులు మాత్రం ఇదంత మంచి పద్ధతి కాదు పూర్తిగా అరటి పండు మీద ఆధారపడితే ఇబ్బందులు వస్తాయంటున్నా వినడం లేదు నాష్.





కాంతి చిత్రం

- ప్యారిస్‌లో 1838లో తీసిన ఓ చిత్రం ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన ఛాయాచిత్రం.
- ముంబయికి చెందిన దిలీష్ పరేఖ్ భారత్‌లో అతి భారీ కెమేరా సేకరణలని కలిగిన వ్యక్తి. ఇప్పటికే 4,425 యాంటిక్ కెమేరాలని సొంతం చేసుకున్నాడు.
- మనిషి ముఖ చిత్రాల్లో కుడివైపు కంటే ఎడమవైపు ఎక్కువ నాణ్యవంతమైన చిత్రాలు వస్తాయనేది కొన్ని పరిశోధనల్లో తేలింది.
- మొదటి డిజిటల్ కెమెరా 'కొడాక్' ను 1975లో స్టీవ్ సాజన్ రూపొందించాడు.

- చంద్రుడి మొట్టమొదటి ఛాయాచిత్రాన్ని తీసింది 1851లో.
- ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 350 బిలియన్ చిత్రాలు తీయబడుతున్నాయి.
- ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటి వరకు అమ్మిన అత్యంత ఖరీదైన కెమెరా లెయికా. 1923లో వియన్నాలో నిర్వహించిన ఆక్షన్‌లో 2.8 మిలియన్ డాలర్ల విలువ చేసింది.
- గ్రీక్ భాషలో ఫొటోగ్రాఫ్ అంటే కాంతి గీసినది అని అర్థం. అంటే కాంతి చిత్రం అన్నమాట.

- 19వ శతాబ్దపు ఫొటోల్లో ఎక్కువగా అందరూ కోపంగానే కనిపించేవారట. అప్పుడు ఫొటో తీయడానికి పట్టే సమయం 20 నిమిషాల కంటే ఎక్కువే.
- పావురాలని ఇష్టంగా పెంచుకునే కొందరు వాటికి ఫొటోగ్రఫీలో కూడా శిక్షణ ఇచ్చేవారు.

- మొదటి ఛాయా చిత్రాన్ని తీసిన వ్యక్తి ఫ్రాన్స్‌కి చెందిన నైస్పర్ నైప్సి. లూయిస్ డ్యాగ్వెరర్ తోపాటు నైప్సి ఫొటోగ్రఫీ విధానాన్ని కనిపెట్టాడు. 1839లో ఫ్రాన్స్ ప్రభుత్వం దీనిపై వున్న పేటెంట్ రైట్‌ని సొంతం చేసుకొని ఫొటోగ్రఫీని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చింది.
- తొలినాళ్లలో డగ్యురో పద్ధతిలో ఫొటో తయారయ్యేందుకు పట్టిన సమయం ఎనిమిది గంటలు.

- ఛాయాచిత్రాల్లో రంగులని చొప్పించే విధానాన్ని కనిపెట్టింది జేమ్స్ క్లార్క్
- ఫొటోగ్రాఫ్ అనే పదాన్ని మొదట ఉపయోగించిన వ్యక్తి సర్ జాన్ హెర్షెల్.
- ఫేస్‌బుక్‌లో ఇప్పటికే 250 బిలియన్లకు మించి ఫొటోల్ని అప్‌లోడ్ చేశారు.
- ఇప్పుడున్న కెమెరాలన్నీ నలుపు తెలుపుల్లో చిత్రాన్ని బంధించి ఆ తర్వాత సెన్సర్ల సాయంతో ల్యూమినెన్స్‌ను అంచనా వేసి కలర్ టింట్‌ను ఇస్తాయి.
- తొలిసారి పురాతత్త్వ పరిశోధకులు తీసిన చిత్రం మాచూపిచ్చూది.
- 1975లో స్టీవ్ సస్సాన్ డిజిటల్ కెమెరాను రూపొందించాడు.

తెలుగు సినిమా తొలి రోజ
ప్రాధాన్యతనిచ్చి పెంచిపో
కథే ప్రాణమని నమ్మేరోజు
పరవశింప చేసి జాతీయ
చేసుకుంది. అక్కినేని, సావి
చిత్రం ముఖ్యంగా సావిత్రికి
చిత్రం 'అర్ధాంగి'. ఆరోజుల్లో
పుల్లయ్య ఇద్దరూ దర్శకులే
పుల్లయ్యగారు సింహంలా
పుల్లయ్యగారు గంగిగోవు
నటి శాంతకుమారిని అర్ధా
స్వీకరించిన వీరు హాస్యచ
సంభాషణం వీరి చిత్రాల్లో
కనిపించేది. ఆయన సెట్ల
వుంటే నవ్వులే నవ్వులు...

అర్ధాంగి అంటే..!

తెలుగు సినిమా అప్పుడప్పుడే ఎదుగుతూ అడుగులు వేస్తున్న రోజుల్లో బెంగాలీ రచయిత శరత్‌చంద్ర ఛటర్జీ ప్రభావం ఎక్కువగా వుండేది. శరత్ విరచితమైన 'స్వయంసిద్ధ' నవల ఈ చిత్రానికి మూలం. ఆ నవల చదివిన పుల్లయ్యగారు శాంతకుమారితో 'స్వయం సిద్ధ' కథ చెబుతాను... విను నీకు నచ్చితే వెంటనే మన సంస్థ రాగిణి ఫిలింస్ పేరు మీద సినిమా మొదలు పెడదాం! అన్నారు. కథ వినిపించారు. శాంతకుమారి కథంతా ఓపిగ్గా విని సమాధానం చెప్పకుండా వేచివెళ్ళిపోయింది. పుల్లయ్యగారు సరదాగా మాట్లాడతారు. సరదాగా కథ చెబుతారు. ఆయన ఊతపదాలన్నీ పచ్చిబూతులే... అయినా విషయం ఎక్కడా డీవియేట్ కారు. అదీ ఆయన గొప్పతనం. శాంతకుమారి తన అభిప్రాయం చెప్పకపోయేసరికి పుల్లయ్య గారికి కంగారుపుట్టుకొచ్చి "కష్టపడి కథ చెబితే... నీ అభిప్రాయం చెప్పవేం? బావుందనో.. బాలేదనో ఏదో ఒకటి చెప్పవేం?" అని అడిగారు. 'ఏం చెప్పమంటారు. మీ వన్నీ పిచ్చిపుల్లయ్య కథలు.. దీన్ని సినిమా తీస్తే నెత్తిమీద కొంగేసుకోవల్సిందే!" అంది నిష్టకారంగా... పుల్లయ్యగారు తక్కువ తిన్నారా. "ఏం నాలాంటి పిచ్చిపుల్లయ్యని కట్టుకొని నువ్వు సుఖపడటం లేదూ" అనడిగేవాడు. దాంతో నవ్వులు.. మళ్ళీ మామూలే.. అక్కినేనికి పుల్లయ్య శాంతకుమారి గార్లకు స్వంత బిడ్డలా వుండేవాడు. అక్కినేని పుల్లయ్యగారు చెప్పిన కథ పిచ్చగా నచ్చేసింది. 'అమ్మా! మనం ఈ కథ చేస్తున్నాం' అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు అక్కినేని. 'ఏమిటబ్బాయ్! నువ్వు కూడా ఇదే మాట!' అంతకు మించి మాట్లాడలేకపోయింది. ఎందుకంటే అక్కినేని అంటే అంతగురిమరి. అలా సినిమా పుట్టింది. పుల్లయ్యగారి ఆశ నెరవేరింది.

సంక్షిప్తంగా కథ :

ఒక వూరిలో గుమ్మడి జమిందారు. ఆయన రెండవ భార్య శాంతకుమారి. మొదటి భ్యార కొడుకు అక్కినేని. పేరు 'రఘు' – చిన్నపుడే తల్లి చనిపోవడం వలన..పనిమనిషి పెంపకంలో పెరిగి.. నల్లమందుకి అలవాటుపడి 'మొద్దులా' తయారవుతాడు. మానసికంగా ఎదుగుదల వుండదు. భయస్తుడు. శాంతకుమారికి పుట్టిన కొడుకు జగ్గయ్య పేరు నాగు. తల్లి అల్లారు ముద్దుగా పెంచడం వలన విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తూ చెడు తిరుగుళ్ళకు బానిసైపోతాడు.. శిస్తు వసూళ్ళకు వెళితే పద్మ అనే అమ్మాయి ఎదురు చెప్పి పంపించేస్తుంది. జమిందారు గుమ్మడికి ఆమె మీద మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. ఇటువంటి వ్యక్తి అయితే తన పెద్ద కొడుకును తీర్చిదిద్ది మనిషిని చేయగలదు. అని ఆశపడతాడు. రఘుతో పద్మకు వివాహం జరిపిస్తాడు పెళ్ళి పీటల మీద తన భర్త వెర్రి బాగులవాడు అని

ల్లో కథకు అత్యంత
ంచింది. సినిమా మనుగడకు
ు... విమర్శకులని సైతం
అవార్డులు సైతం కైవసం
త్రి పోటీపడి నటించిన
మంచిపేరు తీసుకొచ్చిన
సి. పుల్లయ్య, పి.
. దర్శకనిర్మాతలే... సి
కనిపిస్తే... పి.
ా కనిపించేవారు.
ంగిగా
ురులు. సరస
్రధానంగా
ో

తెలుసుకుంటుంది పద్మ. తన భర్తను మళ్ళీ మామూలు మనిషిని చేయడానికి పడరానిపాట్లు పడుతుంది. చివరికి రఘుని (అక్కినేని) మామూలు మనిషిగా తీర్చిదిద్ది సంస్కారవంతుడ్ని చేస్తుంది. తన కోడలు ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని చూసి జమిందారు మురిసిపోతాడు. తన కొడుకు రఘు ప్రయోజకుడైనందుకు తృప్తిగా కన్నుమూస్తాడు జమిందారు. వేశ్యా సాంగత్యంలో మునిగి తేలుతున్న జగ్గయ్యకి డబ్బు అవసరంపడి అన్న (అక్కినేని) మీదకు తిరుగుబాటు చేస్తాడు. ఉన్మాదంలో చివరికి కన్నతల్లిని సైతం చేయి చేసుకుంటాడు. తల్లి శాంతకుమారి తనబిడ్డ జగ్గయ్యను చంపబోతే... పద్మ సావిత్రి అడ్డం పడుతుంది వదిన అన్నయ్య ఔన్నత్యాన్ని అర్థం చేసుకొని పరివర్తన చెందుతాడు. 'అర్ధాంగి' అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిపోతుంది (పద్మ సావిత్రి)!

పాత్రలే కనిపిస్తాయి

ఈ సినిమాలో వున్న విశేషం ఏమిటంటే ఇందులో పాత్రలే



కనిపిస్తాయి. నటీనటులు కనిపించరు గుమ్మడి. శాంతకుమారి, జగ్గయ్య, రేలంగి వెంకట్రామయ్య, చదలవాడ, శివరామకృష్ణయ్య, సురభిబాల సరస్వతి, దొరస్వామిలు పాత్రల్లోనే కనిపించారు. వారి నటన కనిపించదు. ఎక్కడా కృతకత్వం కనిపించదు. ఇదిలా వుంటే హీరో హీరోయిన్లు అక్కినేని సావిత్రి వీరిని గురించి చెప్పుకోవాలి. నిజానికి నాగేశ్వరావుకి నటించే అవకాశం ఎక్కువ పిచ్చివాడిలా అమాయకుడిలా... మొద్దులా.. తెలివితక్కువ తనంతో మాట్లాడుతూ ప్రేక్షకుల మనసు గెలుచుకోవచ్చును. సావిత్రి పాత్ర అలాకాదు. ఎక్కడా మోతాదు మించకూడదు. అలాగని కేరక్టర్ అండర్‌ప్లే చెయ్యకూడదు.

ఆ రోజుల్లో సినిమా బతకాలంటే బిసి సెంటర్స్‌లో విడుదల కావాల్సిందే! బిసి సెంటర్స్‌లో ప్రేక్షకులు మెచ్చుకోని.. మళ్లీ చూసినప్పుడే ఆ సినిమా సొమ్ము చేసుకుంటుంది. పేరు పేరూ.. డబ్బుకి డబ్బూ వస్తుంది. అందుకని నటీనటులు నటన వైడర్‌గా వుండాలి. అది ప్రేక్షకులకు కనెక్ట్‌కావాలి.. ఆ విద్య సావిత్రికి తెలసినట్టుగా నటన మరెవ్వరికీ తెలీదు. అర్ధాంగి చిత్రంలో సావిత్రి విశ్వరూపం చూపించింది. నిజానికి చిత్రంలో హేమాహేమీల్లాంటి నటీనటులు నటించారు. వారందరికంటే చిన్నమ్మాయి సావిత్రే కాని పెద్ద బరువు మోసింది. రాగిణి ఫిలింస్ పరువు నిలిపింది. ఈ సినిమా చేసిన తరువాత సావిత్రి కూడా వారికి తమబిడ్డతో సమానమయిపోయింది. 'అర్ధాంగి' చిత్రమనగానే ముందుగా గుర్తుకువచ్చేది మహానటి సావిత్రే.

ఎన్నో సంసారాలు చిక్కబడ్డాయి

1955 ఆ ప్రాంతంలో అందరూ సతైకాలపువాళ్ళే. వారు. కొంతమంది గొడ్డులా

కష్టపడడం తప్ప కుటుంబ బాధ్యతల్ని నిర్వహించడం తెలీనివాళ్ళు. సావిత్రి నటనకి జనం నీరాజనం పట్టారు. చివర్లో జగ్గయ్యను తల్లి శాంతకుమారి తుపాకితో అంటూ తుపాకీతో బెదిరించి ఆపడం ఎంతో మంది మహిళలకు తమ బాధ్యతల్ని గుర్తు చేసింది. సినిమాకి అవార్డులతో బాటూ రివార్డులూ వచ్చాయి. చాలామంది తమ సమకాలీన సమస్యల మీద ఎంతటి ప్రభావాన్ని చూపించిందో అర్థం చేసుకోవచ్చు.

అక్కినేని అరుదైన ప్రశంస

అర్ధాంగి చిత్రం విజయవిహారం చేస్తోంది. ఒక అరుదైన ప్రశంసని అందజేశాడు అక్కినేని. 'సావిత్రి! నటిగా నీకు రావాలసినంత పేరొచ్చింది. పేరు రావడం గొప్పకాదు.. వచ్చిన పేరు నిలబెట్టుకోవడం గొప్ప! నువ్వు సెలక్టివ్‌గా సినిమాల్లో చేయాలి. 1957 వరకూ నీ డేట్సు నా దగ్గరుంచు. నన్ను ఎవరు ఎప్రోచ్ అయినా ముందు నీ పేరు చెబుతాను' అన్నారు. సాధారణంగా ప్రేక్షకులు తెరమీద ఈ జంటని చూసి మెచ్చుకోరు. ఒకవేళ ప్రేక్షకులు ఇష్టపడ్డారు.. మనకూ ప్రేక్షకులకూ వున్న బంధాన్ని ఆ భగవంతుడు కూడా వేరు చేయలేడు! అంటూ పొగడ్తలతో ముంచెత్తాడు. ఆ తరువాత అక్కినేని, సావిత్రి జంటగా ఎన్నో విజయవంతమైన సినిమాలు చేశారు. నిజానికి సావిత్రి అక్కినేని అభిమాని. అటువంటి అక్కినేని ఇలా ప్రశంసించడం అంటే మాటలు కాదు.

ఆ సమయంలో తమిళ పరిశ్రమలో అగ్రనటులు శివాజీ, ఎంజిఆర్‌లు సావిత్రి డేట్ల కోసం ఎదురుచూశారు. తెలుగులో ఎన్‌టి రామారావు, కాంతారావు జగ్గయ్య లాంటి అప్పటి అగ్రనటులకు అందుబాటులో లేకుండా పోయింది. ఆ సమయంలోనే ఎన్‌టిఆర్ బి సరోజినిదేవి, దేవకిలను ఎంకరేజ్ చేయగా.. కాంతారావుతో జగ్గయ్యతో తెలుగుతెరని పంచుకుంది.! మహానటి సావిత్రి నట ప్రస్థావన వచ్చింది. గనుక చెప్పడం తప్పని సరైంది.

పాటలన్నీ మేలిముత్యాలే!

పి పుల్లయ్యగారు. ఆత్రేయగారు. వారిద్దరి మధ్య విడదీయరాని బంధం వుంది. ఇద్దరూ మాట్లాడుకుంటారు. తిట్టుకుంటారు. వాదించుకుంటారు. విడిపోతారు. మళ్లీ సాయంత్రానికి కలుసుకుంటారు. శరత్ 'స్వయం సిద్ధ' నవల అంత అందంగా తెలుగు తెర పాటలూ ఆత్రేయగారే రాశారు. స్వర రచన విషయానికి వచ్చేసరికి ఆ రోజుల్లో గొప్ప నటుడు ఆకుల నరసింహారావు కూడా రెండు పాటలకు 'వద్దురాకన్నయ్యా.... ఈ పొద్దు ఇలు వదలి పోవద్దురా.. అయ్యా.. వద్దురా కన్నయ్యా..రాసక్రీడకు.. మాధవదేవుడు రాధను రామ్మన్నాడే..' గళం అందించాడు. 'ఇంటికి దీపం ఇల్లాలే.. ఇల్లాలే సుఖాల పంటకు జీవం', 'ఎక్కడ మా చంద్రుడు – చక్కనైనా చంద్రుడూ..'. ఏ పాట కాపాటే జుంటితేనే రుచిని అందిస్తాయి.

అవార్డులు, రివార్డులూ..

అర్ధాంగి ఆ రోజుల్లో విజయవంతమైన అర్థవంతమైన చిత్రం భారతరాష్ట్రపతి పశంసాపత్రాన్ని గెలుచుకుంది. అందంగా కథా వస్తువుని ఆవిష్కరిస్తే దాన్ని ప్రభావం ప్రేక్షకుల మీద తప్పకుండా వుంటుంది. మార్పు సంభవమే అని చెప్పడానికి అర్ధాంగి చిత్రం చక్కని ఉదాహరణ.

- ఇమంది రామారావు

9010133844

ఒక్క గొంతైనా చాలు

రక్తపు మడుగుల్లో
అడుగులు వేస్తూ వచ్చిన
స్వేచ్ఛా స్వాతంత్ర్యానికి
వయస్సు మళ్ళింది...
ఏడు పదుల వయసుకే
ముసల్దయినట్లుంది...
భిన్నత్వంలో ఏకత్వం
మాయమైపోతుందనిపిస్తుంది...
సాంకేతికత పెరుగుతున్న
స్వేచ్ఛా సామ్రాజ్యంలో
సామాజిక విలువల
పతనం కనబడుతోంది...
ఇక జాతీయత ప్రశ్నే
మన ముందుంది....
అర్ధరాత్రే కాదు
అబలకు వెలుతురులోనే
బతుకారిపోతోంది...
నేటి నుండి రేపటికి కాదు
రేపటి నుండే నిన్నటికి
వెళుతున్నట్టుందీ సమాజం...
అంబేద్కర్ వారసులకు
బ్రతుకే కరువైపోయింది...
డెబ్బైయ్ ఏళ్ళైనా ఇంకా
జీవన పోరాటం
జరుగుతూనే ఉంది...
పిడికిలి బిగించి
నరాలు బిగపట్టి
ఎదురుతిరగటానికి
మరో భగత్‌సింగ్ కోసం
చూడటం అనవసరం....
ఎదురుతిరిగి గర్జించడానికి
ఒక్క గొంతైనా చాలు....

- బ్రౌన్
8985759460



కవిత్వం

మహాధనం

మట్టి శిల్పులు దేవతల్ని సృష్టిస్తారు
కవులు అక్షరాలకు ప్రాణం పోస్తారు
కర్షకులు హరిత విప్లవం సాధిస్తారు
గుత్తేదార్లు సొంతలాభం ఆశిస్తారు!
పేదల పశుగ్రాసంగా
బీదల వంట చెరుకుగా
పిల్లల ఆట నిలయంగా
అందరి సేదక్షేత్రంగా నిల్చిన
సారవంతమైన మట్టికొండ అది!
హఠాత్తుగా ఒకడు కొండ తనదంటూ
దండోరా వేశాడు
అందరి ముఖాలపై అనుమతి పత్రం
అతికించాడు
కాదన్న వాడిపై కర్ర పెత్తనం చేసింది
కోర్టుల ఎత్తైన మెట్లు జ్ఞప్తించి
రక్షక భటుల బలమైన లాఠీలు గుర్తొచ్చి
మనసును బంధించుకున్న జనం
మనకెందుకులే అనుకుంది!
మట్టి తులా భారం తూగుతూంది
లారీల్తో ట్రాక్టర్లతో
టిప్పర్లతో టోకు వర్తకం అందుకుంది
బుట్టలు గంపలు
చేటల కొలతల్తో
కేజీలు క్వింటాళ్ల తూకాల్తో
చిల్లర వ్యాపారం సాగుతూంది!
పంటపొలాలకు పండ్ల తోటలకు
చెరువు గట్లకు రహదార్లకు
పూల మొక్కలకు మట్టి గోడలకు
కొండ యిప్పుడు కేంద్ర బిందువు
మట్టి మహాబలం
మట్టి మహాధనం!
బిల్లులు జమాఖర్చులు
డ్రాఫ్టులు చెక్కుల్లో
మునిగి తేలుతూ ఉద్యోగులు
బ్యాంకులకు వెళ్ళటం
బ్యాంకులు యిక్కడకు రావటం
రవి అస్తమించని వాణిజ్య కేంద్రంలో
స్వేదం పారుతూ
స్వేదం తాగుతూ
అక్కడ ఇంద్ర భవనం వెలసింది
మట్టి దాని సృష్టికర్త!

....

ప్రభుత్వ బల పరీక్ష
పర్వంలో
ఇప్పుడు ఇంద్ర భవనానిదే
విజయం తేల్చే ఓటు!

అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ : 9848252946

డా.యం.ప్రగతి
9441450987

కథ

సినిమా చూపిస్త మామా!



రెండ్రోజుల నుంచి ఒకటే ఎగ్జైటయిపోతున్నాడు చక్రి. హైస్కూల్లో సైన్స్ టీచర్‌గా పనిచేసి ఇటీవలే రిటైరైన మేనమామ ప్రకాశం వస్తున్నట్లు ఫోన్ చేశాడు. చక్రి జిల్లా కేంద్రంలో బ్యాంకులో పని చేస్తున్నాడు. తన మేనమామ ఎప్పుడో తన పెళ్ళయిన కొత్తల్లో తమ ఇంటికి రావడమే, మళ్ళీ ఇంతవరకు రాలేదు. ఈ గురువారం మేనమామ వస్తున్నట్లు చెప్పినప్పటి నుండి ఒక చోట నిలబడలేక పోతున్నాడు, కూర్చోలేక పోతున్నాడు. "ఓళిగలు చేయడానికి శనగబేడలు, బెల్లం, రవ్వ అన్నీ ఉన్నాయి కదా. రేప్పొద్దునే శనగబేడలు ఉడికించి పెట్టు. గ్రైండర్‌లో పూర్ణం పట్టించుకొస్తాను. ఓళిగలు బాగా చేస్తావు కదా. మా మామకు అవంటే చాలా ఇష్టం." భార్య రాధతో వేడుకోలుగా అన్నాడు. "చేస్తాను మహానుభావా! ఇప్పటికి 162 సార్లు చెప్పారు మీ మామ వస్తే ఏమేం చేయాలో! రేపు ఓళిగలు చేయాలి, జొన్న రొట్టె, నూనొంకాయ చేయాలి. ఎల్లుండి ఉదయం అలసంద వడలు, నాటుకోడి కూర చేయాలి, మధ్యాహ్నం రాగి సంగటి, తలకూర చేయాలి. అంతేగా?" విసుక్కుంటూ అంది రాధ. "అలా విసుక్కోకు రాధా, మా మేనమామతో నాకున్న అనుబంధం అలాంటిది మరి." నూట అరవై మూడోసారి తమ అనుబంధం గురించి చెప్పబోతూ రాధ ముఖంలోని హావభావాలు చూసి ఆగిపోయాడు.

ప్రతి కుటుంబంలోను తల్లి పుట్టినింటితో సంతానానికి గొప్ప అనుబంధమే ఉంటుంది. అందులోనూ మేనమామలతో మరీ ఎక్కువ. మేనమామ ప్రకాశం, చక్రి తల్లి తోబుట్టువుల్లో ఆఖరివాడు. ప్రకాశం తర్వాత చక్రి పుట్టే వరకూ ఆ యింట్లో చిన్నపిల్లలు లేరు. ప్రకాశానికి, చక్రికి దాదాపు పదహైదేళ్ళ తేడా ఉన్నా మిగిలిన వారికంటే తనతోనే ఎక్కువ అనుబంధం. సెలవుల్లో అమ్మమ్మ గారింటికి వెళ్ళినపుడు ఇల్లంతా పరిగెడుతూ మామతో ఆడుకోవడం, తోట దగ్గర దిగుడుబావిలో ఈత కొట్టడం, మామిడి పండ్ల టెంకల కోసం పోటీ పడటం, ఈతకాయలు, కల్లికాయలు, రేగిపండ్లు తెచ్చుకొని తినడం, శనివారం సంతలో బొరుగులు, తీపి బెండ్లు కొనుక్కొచ్చుకోవడం... ఇలా ఒకటి కాదు అనేక తీపి జ్ఞాపకాలు చక్రి మనసులో పదిలంగా ఉన్నాయి. ఈ గురువారం వస్తున్నట్లు ఫోన్ చేసి చెప్పగానే అవన్నీ గుర్తొచ్చి భార్యతో పదేపదే పంచుకుంటున్నాడు. రేపే గురువారం. "చుట్టుపక్కల చూడాల్సిన ప్రదేశాల లిస్టు తయారు చేశాను. ఓసారి చూడు ఏమన్నా మిస్సయ్యానేమో. మా మామకు ఏదీ వదలకుండా అన్నీ చూపించాలి." లిస్టు రాధకిచ్చాడు.

ooo

మూడు రోజులు ఇట్టే గడచిపోయాయి ప్రకాశానికి. వండిన వంట వండకుండా వండి వడ్డించడం, ఏ లోటూ లేకుండా చూసుకోవడం... మేనల్లుడంటే సరే, అతని భార్య కూడా గౌరవంగా, ప్రేమగా చూసుకోవడం అతనికి చాలా సంతోషాన్నిచ్చింది. చుట్టుపక్కల చూడాల్సిన ప్రదేశాలన్నీ చూపించాడు చక్రి మేనమామకు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ కబుర్లతో ఏ అర్ధరాత్రో నిద్రలోకి జారుకుంటున్నారు.

ఆరోజు ఆదివారం...

మధ్యాహ్నం భోజనం కాగానే "మామా ఈరోజు సాయంత్రం సినిమాకు పోదాం." మామ కోసం మరో ప్రోగ్రాం సిద్ధం చేశాడు చక్రి. "వద్దులేరా, టీవీలో రోజూ చూస్తూనే ఉన్నాం కదా, హాలుకు పోయి సినిమా చూసే ఓపికెక్కడుంది? వద్దులే." "అట్లనద్దు మామా, మనూళ్ళో ఎన్ని సినిమాలు చూపించావు నువ్వు. ఈరోజు నేను నీకు సినిమా చూపిస్తా. ఇప్పుడంతా మల్టిప్లెక్స్ థియేటర్లు తెలుసా! నువ్వు చూసి తీరాలి. ఏ సినిమాకు పోదాం చెప్పు." దినపత్రిక తీసుకొచ్చాడు. హడావుడిలో గమనించుకోలేదు.. అది నాలుగు రోజుల క్రితం పేపరు. "వద్దంటే వినవు కదా. అట్లయితే ఏదో గేమ్స్‌కు సంబంధించిన సినిమా ఉందంట గదా, అది చూద్దాం." ఆ సినిమా ఏ థియేటర్లో ఉందో చూశాడు చక్రి. "నువ్వు కూడా తయారవ్వు రాధా. వంటపని పెట్టుకోకు. వచ్చేటపుడు బయటే డిన్నర్ చేసేద్దాం." సాయంత్రం ఐదున్నరకే థియేటర్ దగ్గరికి చేరారు. అదో మూడు థియేటర్ల కాంప్లెక్స్. అక్కడ ఇసకేస్తే రాలని జనం. భారీ హోర్డింగులు, అట్టహాసంగా దండలు, ఆర్భాటాలూ. "ఇదేందిరా చక్రీ, ఇది మనమనుకున్న సినిమా కాదే. పోస్టరు ఏదో 'మహ భల్లూక' అని ఉంది." ప్రకాశం నొసలు చిట్లిస్తూ అన్నాడు. "నువ్వుండు మామా, వేరే దాంట్లో ఉందేమో కనుక్కుంటా." వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగొచ్చాడు చక్రి. "మూడు హాళ్ళలోను అదే సినిమా అంట. టికెట్లు కూడా అయిపోయాయి. ఇప్పుడెలా?" రాధతో అన్నాడు చక్రి మెల్లగా. అది ప్రకాశానికి వినబడింది. "పోనీలేరా ఇంటికెళ్ళి పోదాం." ప్రకాశం మాటలను ఒప్పుకోలేదు చక్రి. "మరో థియేటర్లో చూద్దాం మామా. ఈమధ్య చిన్న సినిమాలు కూడా బాగుంటున్నాయి." మరో కాంప్లెక్స్‌కు వెళ్ళారు. అక్కడా అన్ని థియేటర్లలో అదే 'మహాభల్లూక'. అక్కడా హౌస్‌ఫుల్. మరో మూడు నాలుగు

థియేటర్లు తిరిగినా అన్ని చోట్ల అదే సినిమా. "ఇదేందిరా అన్ని హాళ్ళలోను ఒకే సినిమా ఆడిస్తున్నారు? అంటే సినిమా చూడాలనుకుంటే అదొక్కటే చూడాల్నా?" ప్రకాశానికి చిరాకేసి అన్నాడు. "ఇది పెద్ద బ్యానర్లో తీసిన భారీ సినిమా మామా. పెద్ద యాక్టర్లు, గ్రాఫిక్స్, భారీ సెట్టింగ్స్‌తో తయారయింది. ఇదే చూద్దాంలే మామా. అందరూ గొప్పగా చెబుతున్నారు." చక్రి నానా తిప్పలూ పడి, ఒక్కో టికెట్ పన్నెండు వందలు పెట్టి మూడు టికెట్లు తీసుకొచ్చాడు. అతి కష్టం మీద సినిమా హాల్లో చేరితే సీట్లు నిండిపోయి మధ్యలో వేసిన ప్లాస్టిక్ కుర్చీలలో కూచో బెట్టాడు గేట్ కీపరు. ఆ సీట్లలో ఇబ్బందిగా కూచున్నారు ముగ్గురూ. కింద కాళ్ళకు దోమలు కుట్టి చంపుతున్నాయి. పేరుకు ఎయిర్ కండిషన్డ్ థియేటర్ అయినా ఎసి వెయ్యలేదు. మరోవైపు అభిమానుల గోల. ముందు వరుసల్లో కూర్చున్న వీరాభిమానులు పూలు, పేపర్లు ఎగరేస్తూ, ఈలలేస్తూ, కేకలు పెడుతూ చిందులేస్తున్నారు. ఎవరికీ వారిని వారించే ధైర్యం లేదు. ప్రకాశానికి లేచి వెళ్ళిపోదామనిపించింది కానీ, చక్రి ముఖం చూసి ఆగిపోయాడు. రాధ కూడా అసహనంగా కదులుతోంది. మొత్తం మీద మూడు గంటల సినిమా బరువుగా ముగించి లేచారు. హాల్లోంచి బయటపడి కారు దగ్గరికి చేరుకోవడానికి గంట పట్టింది. ఆ పైన థియేటర్ ఆవరణలోంచి బయట పడటానికి మరో గంట పట్టింది. "ఈ టైంలో బయటేం తింటాం గానీ, పళ్ళు తిని ఈ పూట కడుపు నింపుకుందాం, ఆరోగ్యానికీ మంచిది." ప్రకాశం మాటలతో చక్రి సంగతేమో గాని రాధకు రిలీఫ్‌గా అనిపించింది. "ఎట్లుంది మామా సినిమా?" కారు నడుపుతూనే అడిగాడు చక్రి. "ఏముందిరా ఆ సినిమాలో? ఎక్కడన్నా కథకు సపోర్ట్‌గా గ్రాఫిక్స్ ఉండాలి గానీ, గ్రాఫిక్సే సినిమా అన్నట్లుందిది. పెద్ద పెద్ద చెట్లు గాల్లో ఎగరడం, మంచు పర్వతాలు, మహాసముద్రాలు పక్కపక్కనే సావాసం చేయడం... ఎక్కడన్నా జరిగేదేనా? తాటి చెట్లకు ఎక్కడన్నా స్థితి స్థాపకగుణం ఉంటుందా ఊగటానికి?" సైన్స్ టీచరు ప్రకాశం లాజిక్‌గా మాట్లాడాడు. "సినిమాల్లో మ్యాజిక్కే తప్ప లాజిక్ చూడకూడదు మామా. ఆ గ్రాఫిక్స్ కోసమే ఎన్ని కోట్లు ఖర్చు చేశారో తెలుసా?" సమర్థించుకోబోయాడు చక్రి. "నిజమేరా, లాజిక్ చూడకూడదు. మరి సినిమాను సినిమాలాగా చూడకుండా అభిమానులు వీరావేశంతో ఎందుకు ఊగిపోతున్నారు, కొట్టుకు చస్తున్నారు? అయినా టెక్నాలజీ ఇంతగా అభివద్ధి చెందిన ఈ రోజుల్లో గ్రాఫిక్స్‌ను సృష్టించడం పెద్ద క్రియేటివిటీ కాదు. టెక్నాలజీ ఏ మాత్రం లేని రోజుల్లోనే కథకు జోడింపుగా బ్రహ్మాండమైన గ్రాఫిక్స్‌తో తీసిన కళాత్మక చిత్రాలెన్ని చూడలేదు మనం. అదంతా అటుంచు, అసలు సగటు ప్రేక్షకుడు ఏ సినిమా చూడాలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛ కూడా లేకుండా అన్ని థియేటర్ల లోను ఒకే సినిమా ఆడించడం దురాక్రమణ కాదా? ఏ కథా లేని సినిమాకు అదేదో అద్భుత కళాఖండమని హైప్ క్రియేట్ చేసి చిన్న సినిమాలను తొక్కేయడమే కదా. ఇది సినిమా పరిశ్రమకు మంచిదా?" కాస్త ఊపిరి తీసుకొని మళ్ళీ అందుకున్నాడు ప్రకాశం. "ఆ సినిమాలో ఒక్క పాయింట్ మాత్రం బాగా నచ్చిందిరా నాకు. అహంకారంతో, అధికారంతో భారీ విగ్రహాలు ప్రతిష్ఠించినా చివరకు నేలకొరిగి ముక్కలు కావాల్సిందే, సామాన్యుల కాళ్ళ కింద చేరాల్సిందేనన్న సందేశం నాకర్థమైంది. ఇదే సూత్రం ఇలాంటి భారీ సినిమాలకు కూడా వర్తిస్తుందని సదరు దర్శక నిర్మాతలు, సోకాల్డ్ హీరోలు గుర్తు పెట్టుకోవాలి." మాటల్లోనే ఇల్లు చేరుకున్నారు. "సర్లే మామా వచ్చే శుక్రవారం సినిమాలు వదిలేసి మళ్ళీ రంగప్రవేశం చేసిన పెద్ద హీరో 350వ సినిమా రిలీజవుతోంది. అది చూద్దాంలే." కారు దిగుతూ అన్నాడు చక్రి. ఆ మాటకు చటుక్కున నిలబడ్డాడు ప్రకాశం. "ఇదిగో మరోసారి సినిమా చూపిస్త మామా' అన్నావంటే ఇప్పుడే బస్సెక్కి ఊరికి పోతా." అంటూ చిన్నబుచ్చుకున్న చక్రి ముఖం చూసి నవ్వేశాడు. "నేనొచ్చింది ఈ సినిమాలు చూడాలని కాదురా. నీతో ఓ విషయం మాట్లాడాలని. లోపలికి పద, తీరిగ్గా మాట్లాడుకుందాం."

ооо

చక్రి ఏమిటా అని ఆలోచిస్తున్నాడు. బట్టలు మార్చుకొచ్చిన ప్రకాశం మొదలు పెట్టాడు. "నీకు గుర్తుందా నీ చిన్నప్పుడు మనూళ్ళో పంచాయతీ లైబ్రరీలో తెగ పుస్తకాలు చదివే వాళ్ళం గద!" మధ్యలోనే చక్రి అడ్డుకున్నాడు, "అవునవును, చందమామ, బాలమిత్రలతో పాటు ఎన్నెన్నో మంచి పుస్తకాలు పోటీపడి చదివే వాళ్ళం. అప్పుడప్పుడు సినిమాలు కూడా వేసే వాళ్ళు." మరోసారి ఎగ్జయిటయిపోయాడు చక్రి. "ఆ... ఆ... అదే. ఇప్పుడా లైబ్రరీ దాదాపుగా మూతబడిపోయింది, శిథిలమై పోయింది. నా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో దాన్ని బాగు చేయాలనే ఆలోచన వచ్చింది. ఒకవేళ దాన్ని బాగుచేయడానికి ఏవైనా అభ్యంతరాలుంటే, నా భాగంలోకి వచ్చిన వాటాను రెన్నోవేట్ చేయించి చిన్నపాటి గ్రంథాలయంగా తయారు చేద్దామనుకుంటున్నాను. అందులోనే ఓ మినీ థియేటర్ ఏర్పాటు చేసి, తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలతో పాటు, ప్రపంచంలోని అన్ని భాషల్లోని పాత-కొత్త క్లాసిక్ సినిమాలు, ఆలోచింపజేసే విజ్ఞానదాయక చిత్రాలు ప్రదర్శించాలి. ఇంకొంత మంది మిత్రులు నాకు సహకరిస్తున్నారు. దీనికోసం కావాల్సిన కంప్యూటర్, ప్రొజెక్టర్, హెూం థియేటర్ ఇతర పరికరాల గురించి నువ్వే విచారించాలి. ఏమంటావు?" మాట్లాడుతున్న ప్రకాశం కేసి ఆరాధనగా చూశాడు చక్రి. "నేనేమంటాను మామా, నువ్వెప్పుడూ డిఫరెంట్ గానే ఆలోచిస్తావు. నువ్వు చేసే మంచిపనికి నా సహకారం ఎప్పుడూ ఉంటుంది. రేపే అన్ని వివరాలు కనుక్కుందాం. ఇక పడుకుందాం మామా, బాగా లేటయిపోయింది." లేచాడు చక్రి. ★



అద్భుత సౌందర్యం కేరళ సొంతం...

అద్భుతమనిపించే ప్రకృతి రమణీయతను ఆస్వాదించడానికి... అబ్బురపరిచే అందాలను చూడటానికి... ఆహ్లాదంగా గడపడానికి విదేశాలకు వెళుతుంటారు చాలామంది. మన దేశంలో అంత ప్రకృతి రమణీయత లేదనేది కొందరి భావన. భారత్ ప్రకృతి సంపదకు పుట్టినిల్లు. ప్రకృతి సంపదలో విదేశాలకు మనం ఏమాత్రం తీసిపోం. ఇటీవల నేను మా చిన్నబ్బాయి అచ్యుత్ కుటుంబంతో కలిసి కేరళకు వెళ్ళాను. అక్కడ ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రకృతి ఒడిలో తేలియాడిన అనుభూతి కలిగింది. కన్యాకుమారి, అలెప్పీ, త్రివేండ్రం, కోవెలం, వెంబనాడ్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రాష్ట్రం మొత్తం విహార కేంద్రంగానే మనకు కనబడుతుంది.

ప్రకృతి సంపదను పర్యాటక కేంద్రాలుగా మార్చడంలో, తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో అక్కడి ప్రభుత్వాలు తీసుకున్న చొరవ, ముందుచూపు ప్రశంసనీయం. ప్రకృతిని సైంటిఫిక్ టెంపర్‌తో అనుసంధానం చేయడం ద్వారా కేరళలో అద్భుతాలు సృష్టించారని చెప్పొచ్చు. ఎందుకంటే అక్కడి ప్రకృతి సౌందర్య దశ్యాలు అలాంటివి. ఇంతటి మనోహర దృశ్యాలను తీర్చిదిద్దడంలో టెక్నాలజీని వినియోగించుకుంటూ పర్యాటక అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తున్న కేరళ ప్రపంచానికే ఆదర్శం. పర్యాటకశాఖ ప్రచారం కోసం కేరళకు పెట్టుకున్న పేరు 'గాడ్స్ ఓన్ కంట్రీ.' పేరుకు తగినట్టుగానే పశ్చిమ కనుమలు, అరేబియా మహా సముద్రానికి మధ్యలో ఉన్న కేరళ ప్రకృతి సౌందర్యానికి, విభిన్న సంస్కృతికి, సంపూర్ణ అక్షరాస్యతకు మారు పేరుగా నిలుస్తోంది. మేము మున్నార్‌కు వెళ్తున్న కొద్దీ దారిపొడుగునా చిన్నచిన్న నీటి ప్రవాహాలు కొండల పైనుంచి గలగల శబ్దం చేస్తూ కిందకు జారుతుంటే ఒళ్లు పులకించి పోతుంది. కొండలపై టీ తోటలు, రబ్బరు చెట్లు. ఇలా ఏ వైపు చూసినా పచ్చగా, అత్యంత మనోహరంగా కనిపించింది. అయితే, దట్టంగా కమ్ముకున్న మేఘాలు, వాన చినుకులు మాతో దోబూచులాడటంతో మా పర్యటనకు కొంత ఆటంకం ఏర్పడింది. అనంతమైన ప్రకృతి సంపద, పురాతన చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు పుట్టినిల్లుగా ఉన్న భారత్ పర్యాటక రంగాన్ని నిర్లక్ష్యం చేసిందనే చెప్పాలి. కేరళలో ప్రకృతిని అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా



మార్చిన విధానాన్ని చూసిన తర్వాత నేనంటున్న మాట ఇది. ఇంత గొప్ప అభ్యున్నతిని సాధించాలంటే ఎంతో రాజకీయ చైతన్యం కూడా అవసరం. రాజకీయ పార్టీలు అధికారం మారినప్పుడల్లా కొత్త కొత్త ప్రాజెక్టుల పేర్లతో అభివృద్ధిని వెనక్కి నెట్టే కార్యక్రమాలే నేడు జరుగుతున్న నేపథ్యంలో కేరళ ప్రజల రాజకీయ చైతన్యాన్ని తప్పకుండా అభినందించాల్సిందే. చైనాలో జీవనానికి మూలమైన ఎల్లో రివర్ స్ఫూర్తితో కేరళలో అరేబియా మహాసముద్రం నుంచి నీటిని ఆధునిక సాంకేతికతను వినియోగించి ఓ వైపు మంచినీరు, మరో వైపు ఉప్పునీరు ఉండేలా వేరుచేశారు. అలాగే మున్నార్‌లో కూడా కొండలపై పడే వర్షపు నీటిని కూడా టీ తోటల్ని పెంచేందుకు వినియోగిస్తూ ముందుకెళ్తున్నారు. మున్నార్ సమీపిస్తున్న కొద్దీ కొండల మీద పచ్చని గళ్ళ తివాచీలను పరిచినట్టు అనేక టీ తోటలు కనిపిస్తాయి. అసలు మున్నార్ ప్రధాన ఆదాయ వనరు తేయాకు పంట.. ఆ తోటల్ని చూసేందుకు వచ్చేది పర్యాటకులేనట.

ప్రకృతిలోని శక్తితో ప్రజల అవసరాలను తీర్చాలి. ప్రకృతిని నిందించకుండా దాన్ని సామాజిక వికాసానికి వినియోగించుకుంటే ఇలాంటి ప్రకృతి సౌందర్యాన్ని అన్ని రాష్ట్రాల్లో మనం చూడొచ్చు. ప్రకృతిని లోబరచుకొని దాని ఫలాను ప్రజలకు చేరవేసేందుకు కృషిచేయాలి. చైనాలో ఎల్లో రివర్ విషయంలో అక్కడి పాలకులు ఇదే విధానాన్ని అనుసరించడం ద్వారా వరదలను అరికట్టి గుట్టల నుంచి మళ్లించడం ద్వారా మానవ అవసరాలకి ఆ నీరు ఉపయోగించబడింది. యూనివర్సిటీల్లో రీసెర్చి ద్వారా ప్రకృతికి సైంటిఫిక్ టెంపర్‌ను అద్ది ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది. మన దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతోన్న చాలావాటిల్లో మౌలిక వసతుల లేమి, నిర్వహణ లోపంతో మరుగునపడుతున్నాయి. అందువల్ల పర్యాటక కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు కలిగిన వసతులను పర్యాటకులకు అందించడం ద్వారా ప్రభుత్వాలకు మంచి గుర్తింపుతో పాటు ఆదాయం కూడా సమకూరుతుంది. ప్రకృతి సహజ సంపదను మరింత అభివృద్ధి చేసి భావితరాలకు అందించాల్సిన బాధ్యతని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించాలి.

డాక్టర్ చుక్కా రామయ్య

ప్రముఖ విద్యావేత్త, సామాజికవిశ్లేషకులు

సోషలిజమే ఎందుకు...



పుస్తకం పేరు : సోషలిజమే ఎందుకు
రచన : ఇస్త్వాన్ మెస్‌జారస్
పేజీలు : 88, వెల :రూ 40
ప్రతులకు : అన్ని ప్రజాశక్తి బుక్ హౌసుల్లో

సోషలిజాన్ని సాధించాలంటే చరిత్ర పరిణామక్రమంలో కార్మికవర్గం ప్రయత్నపూర్వకంగా జోక్యం చేసుకోవాలి. ఆ కృషి వదిలిపెట్టి ఇంకా అనుకూల పరిస్థితులు ఏర్పడి, సమస్యలను కాలమే పరిష్కరిస్తుందని కార్మికవర్గం చేతులు ముడుచుకుని కూచుంటే లాభం లేదు. మన కాలపు పెట్టుబడిదారీ వ్యవస్థ విధ్వంసకర పాత్రను సరిగా అర్థం చేసుకుంటే సోషలిస్టు ప్రత్యామ్నాయానికి తగిన పరిస్థితులు వాతంటవే వస్తాయని భావించడం కన్నా పెద్ద తప్పిదం వేరొకటి ఉండదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్న దశలో పరిస్థితులు ఎంత అనుకూలంగా అనిపించినప్పటికీ కార్మికవర్గం ఎలాంటి రాజీలకు, తప్పుడు సిద్ధాంతాలకూ ప్రభావితం కాకుండా చూసుకోవాలి. కార్మికవర్గం తన లక్ష్య సాధనలో దూకుడుగా విజయం సాధించాలంటే ప్రతిపక్షుల ప్రభావం నుండి రక్షింపబడాలి. (21వ పేజి)

'సోషలిజమే ఎందుకు' అనే పుస్తకం ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాడే వారందరూ తప్పక అధ్యయనం చేయాల్సిన పుస్తకాల్లో ముఖ్యమైంది. హంగరీ దేశస్థుడైన ఇస్త్వాన్ మెస్‌జారస్ మార్క్సిస్టు మేధావి. ప్రస్తుతం ఇంగ్లాండులోని ససెక్స్ విశ్వవిద్యాలయంలో ఎమిరైటస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన రాసిన గ్రంథానికి అనువాదమైన 'చారిత్రక సమయం మోపే భారాలు, విసిరే సవాళ్ళు' అనే గ్రంథంలోని చివరి అధ్యాయాన్ని ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్ వారు 90 పేజీల పుస్తకంగా ప్రచురించారు. నేటి పరిస్థితులకు ప్రత్యామ్నాయం సోషలిజమేనన్నది రచయిత వాదన.

ఈ వాదన అర్థం కావాలంటే నేటి పెట్టుబడిదారీ విధానం అర్థం కావాలి. ప్రస్తుత ప్రపంచీకరణ, దాని లోతుపాతులు అర్థం కావాలి. దాంతోనే సరిపోదు. ఆ ప్రపంచీకరణను, దాని పర్యవసానాలను నిందించే ధైర్యం కావాలి. సరిగ్గా ఇక్కడే 'సోషలిజమే ఎందుకు' పుస్తకం పాత్ర ముందుకొస్తుంది. ప్రపంచీకరణ విధానాలను ప్రతిఘటించాలనుకునే ఎవరైనా ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. ఈ చిన్న పుస్తకంలో 4 అధ్యాయాలున్నాయి. పెట్టుబడిదారీ విధానం ఎంతబోలుగా నిర్మితమైందో వివరించడంతో బాటు దాన్ని కూల్చాల్సిన ఆవశ్యకతను, అవలంబించాల్సిన ఎత్తుగడలను కూడా మొదటి అధ్యాయంలో రాశారు. ప్రారంభంలో పేర్కొన్న పేరా ఈ అధ్యాయంలోనిదే. అన్యవర్గ సిద్ధాంతాలు సృష్టించిన భ్రమలు నేడు కార్మికోద్యమంలో రాజ్యమేలడాన్ని మన దేశంలో చూస్తున్నాం. దేశవ్యాపిత కీలక రంగాలలో ఇటువంటి సంఘాలు పోషిస్తున్న విచ్ఛిన్నకర, వర్గసంకర విధానాలు ప్రభుత్వాలకు పచ్చజెండా ఊపడం నేటి మన అనుభవం కదా! 'పెట్టుబడిదారీ వ్యవస్థ సమర్థకుల వద్ద శక్తివంతమైన పొగమంచు యంత్రాలున్నాయ'ని చెప్పడం ద్వారా నేటి పాలకుల విధానాల్ని, మీడియా మాయను ఈయన ఎత్తిచూపారు. 'కాలమే ఆ పొగమంచును కరిగిస్తుందనడం' ద్వారా నేడు జరుగుతున్న పరిణామాలను ఉదాహరణగా మధ్యప్రదేశ్‌లో రైతులపై జరిగిన కాల్పులు మొదలైన వాటిని ఈ కోవలోనివిగా మనం అర్థం చేసుకోవాలి.

రెండవ అధ్యాయం మరీ ముఖ్యం. ఎందుకు ప్రపంచీకరణ విధానం కుప్పకూలిపోతుందో ఈ అధ్యాయం విశదీకరిస్తుంది. "పెట్టుబడిదారీ విధానంలో అంతర్గత వైరుధ్యాలు, అసమానతలు పెట్టుబడిదారీ ప్రపంచీకరణతో పరిష్కారమౌతాయని పండితులు ఫ్యాషన్‌గా చెప్తుంటారు. కానీ ఈ వైరుధ్యాలు, అసమానతలకు మూలకారణం పెట్టుబడిదారీ విధానమే"నని మార్క్స్ వందేళ్ళ క్రితమే చెప్పారని వివరిస్తాడు రచయిత.

ఇక మూడవ, నాల్గవ అధ్యాయాలు చదువుతున్నంత సేపూ నేటి మన పాలకులు గుర్తుకు రాకమానరు. పెట్టుబడిదారీ పాలకులు వేసుకున్న మేలిముసుగును చింపిపారేస్తాడు రచయిత. పెట్టుబడిదారీ విధానంతో 'డీల్' చేసేవాళ్ళు దాని యెడల ఎంత కసిగా ఉండాలో తెల్పే ఈ పుస్తకంలో రెండు అంశాల్ని మనం విమర్శనాత్మకంగా పరిశీలించాలి. నేడు పెట్టుబడిదారీ విధానాన్ని, ముఖ్యంగా ఫైనాన్స్ పెట్టుబడి వల్ల జరుగుతున్న పరిణామాల్ని చూస్తే ఈ పుస్తక రచన కాలంలో సామ్రాజ్యవాద దేశాల మధ్యనున్న వైరుధ్యం అవ్యక్తంగా వుండేది. కారణం బహుళజాతి కంపెనీల ఆంగిక నిర్మాణం. దీన్ని 30వ పేజీ చివర్లో, 37వ పేజి చివర్లో రాసిన అంశాలు పరిగణనలోకి తీసుకున్నట్టు కన్పడదు. 55వ పేజీ చివరి వాక్యం, 56వ పేజీలో రాసిన అంశం కూడా చరిత్రపై సరైన తీర్పు అనిపించుకోదు. (హిట్లర్ జర్మనీలోని ఆనాటి గుత్త పెట్టుబడిదార్ల ముద్దుబిడ్డగా ఎలా పెంచి పోషించబడ్డాడో 'ఫాసిజం అండ్ సోషల్ రివల్యూషన్' అనే పుస్తకంలో కామ్రేడ్ రజనీ పామీదత్ వివరించారు). హిట్లర్ గురించి, ఫాసిస్టు ప్రమాదం గురించి సరైన అంచనా వేశారు. కాబట్టే సరైన ఎత్తుగడలవలంబించారు. ఫాసిజాన్ని మట్టి కరిపించారు. ఈ పరిణామం జాతీయ విముక్తి ఉద్యమాలకు ఊపునిచ్చింది. మన దేశం సహా అనేక దేశాలు స్వతంత్ర దేశాలుగా అవతరించేందుకు దోహదం చేసింది. కామ్రేడ్ రంజన్ అనువాదం బాగుంది. మన తెలుగు రాష్ట్రాల్లోని చేయి తిరిగిన అనువాదకుల్లో ఒకడైన ఈ కామ్రేడ్ సామాన్య కార్మిక నాయకుల్ని కూడా గమనంలో పెట్టుకుని సులభమైన మాటలు రాయటం 'మహారాజ్ఞి', 'హైన్యశక్తులు' వంటి మాటలు గాని, 'సరుకు చేయడం', 'చిదుపలు, చిదుపలుగా' వంటి పద ప్రయోగాలు గాని చేయకుండా ఉంటే బాగుండేది. 'చేస్తావున్నాయి' 'కొడతావున్నాయి' వంటి క్రియలు దాదాపు పుస్తకమంతా వున్నాయి. పంటి కింది రాయిలా వున్న ఇవి కూడా లేకుండా ఉంటే అనువాదం బాగుండేది. ముందే చెప్పినట్టు ప్రతి కార్యకర్త అధ్యయనం చేయాల్సిన పుస్తకమిది.

-సుధా భాస్కర్

ఓరోరి యంత్రుడా..!

భారీ రాక్షస బల్లులు స్క్రీన్‌పై నోరు తెరిచి గర్జిస్తుంటే నోరెళ్లబెట్టేస్తాం. ఊహకు అందని గ్రహాంతర జీవుల పోరాట దృశ్యాలు వస్తే సీట్లకు అతుక్కుపోతాం. వాటి కనుబొమ్మ నుంచి దంత భాగాల భయంకర కదలికలను చూసి జడుసుకుంటాం. ఆ జీవులు నిజంగానే ఉన్నాయని వాటి చర్మం ముడతలను, కండరాల కదలికల్ని చూపించే క్లోజప్ షాట్లతో నమ్మేస్తాం. ఈ భ్రమను కలిగించేది గ్రాఫిక్స్ మాయాజాలం కాదు. హావభావాలు, భావోద్వేగాలను యాంత్రికబొమ్మలతో పలికించేది రోబోటిక్ తోలుబొమ్మలాట యానిమాట్రానిక్స్ మెకానిజమే. జురాసిక్ సిరీస్, టెర్మినేటర్, ఏలియన్స్, ఈటీ, స్టార్‌వార్స్, ప్రొమిథియెస్, ఐరన్ మేన్, క్లాష్ ఆఫ్ టైటాన్స్, జాస్ వంటి భారీ హాలీవుడ్ సై-ఫై యాక్షన్ థ్రిల్లర్లలో ఈ సాంకేతికతకే పెద్ద పీట వేశారు. వింత ఆకారాల జీవుల రూపాలను నిజమని నమ్మేలా రూపొందించి, వాటి హావభావాల వంటి సున్నితాంశాల నుంచి భీకర పోరాటాల్లోని భారీ కదలికల వరకు ఈ యంత్రాల తోలుబొమ్మలాటతో చిత్రీకరించినవే.



యానిమాట్రానిక్స్ రోబోటిక్స్‌కు దగ్గరగా ఉంటుంది. కానీ, ఇక్కడ పూర్తిగా యంత్రాలతోనే మొత్తం కదలికల్ని నడిపించరు. యానిమాట్రానిక్స్‌ను తోలుబొమ్మలాటలా ఆడించినా చాలా మెకానిజమే ఉంటుంది. గ్రాఫిక్స్ మాయాజాలం ముంచెత్తుతున్నా యానిమాట్రానిక్స్ స్థానం చెక్కుచెదరపోవడానికి కారణం ఆ రూపాల్లో ఉట్టిపడే జీవకళే. కంటి రెప్ప నుంచి చర్మం ముడతల వరకు ప్రతి చిన్న అంశం సజీవంగా కనిపించేట్టు చేయడానికి యానిమాట్రానిక్స్‌కు ధీటైన సాంకేతికత రాలేదు. కంప్యూటర్ గ్రాఫిక్స్ కూడా ఆ స్థాయి క్లారిటీని అందించలేదు. ఇవన్నీ బొమ్మలే అయినా నమ్మశక్యం కాని వాటి కదలికలు సజీవప్రాణుల్లా తోస్తాయి. రాక్షస బల్లులు, విచిత్రమైన వృక్షాలు, జంతువులతోపాటు మనుషుల రూపాలను కూడా యానిమేట్రిక్స్‌తో చేస్తారు. మానవ యానిమాట్రిక్స్‌నే ఆండ్రాయిడ్‌లంటారు. సినిమాలే కాక థీమ్ పార్కుల్లోను వీటిని ఉపయోగిస్తారు. యానిమాట్రానిక్స్ కీలకం శరీర నిర్మాణ శాస్త్రం, రోబోట్స్, మెకాట్రానిక్స్, తోలు బొమ్మలాట సూత్రాలు. చర్మం, కండర ఆకృతి వంటి వాటికి పాలెంటాలజిస్టులు, శరీర నిర్మాణ శాస్త్ర నిపుణుల సూచనలు తీసుకుని ఫోమ్ లేటెక్స్, ఆర్టీవీ సిలికోన్, ఫోమ్ మోల్డ్, ఫైబర్ గ్లాస్‌లను ఉపయోగిస్తారు. కళ్లు, దంతాలకు ఆక్రిలిక్ వంటి పదార్థాలను వినియోగిస్తారు. న్యూమాటిక్స్, హైడ్రాలిక్స్, ఎలక్ట్రిక్ పరికరాల ద్వారా వీటికి కదలికలు తెస్తారు. కంప్యూటర్ కంట్రోల్‌తో పాటు చోదకుడి అవసరం కూడా చాలా ఉంటుంది. టెలీఆపరేషన్‌నూ ఉపయోగిస్తారు. మోషన్ ఆక్యుటేటర్ల సాయంతో కండరాల కదలికల్ని తెస్తారు. కోపాన్ని, బాధను, సంతోషాన్ని, చిరాకును, భయాన్ని, ఆశ్చర్యాన్ని పలికించే ముఖకదలికలకు ఫాక్స్ పేరిట ఓ కోడింగ్ సిస్టమ్‌ను ఎక్మాన్, ఫ్రీజెన్‌లు రూపొందించారు. ఆ తర్వాత 22 భావోద్వేగాల వరకు పలికించగల ఓసీసీ మోడల్‌ను ఓర్టోని, క్లోర్, కోలిన్స్ అభివృద్ధి చేశారు. 1964లో తొలిసారిగా 'మేరీ పాపిన్స్' అనే చిత్రంలో యానిమాట్రానిక్ పక్షులను ఉపయోగించారు. 1989లో ఏ-100 అనే యానిమాట్రానిక్‌ను 'విజర్డ్ ఆఫ్ ఓజ్' చిత్రంలోని మంత్రగత్తె రూపానికి వినియోగించారు. ఈ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెంది 2008లో వచ్చిన టాయ్ స్టోరీ చిత్రంలోని మిస్టర్ పొటాటో హెడ్ కేరక్టర్ పెదాల కదలికల్ని చాలా మెరుగ్గా రూపొందించగలిగారు. డిస్నీ థీమ్ పార్కుల కోసం తొలుత ఆడియో యానిమాట్రానిక్స్ టెక్నాలజీని వాడినా సినిమాలు ఆ సాంకేతికతకు బ్రహ్మరథం పట్టాయి. హారర్ సినిమాలు మొదలుకొని కార్టూన్ చిత్రాల వరకు యానిమాట్రానిక్ సాంకేతికతను గణనీయంగా ఉపయోగించారు. కంప్యూటర్ గ్రాఫిక్స్ సినీ పరిశ్రమను ముంచెత్తినా కూడా 90ల నాటి యానిమాట్రానిక్స్ సాంకేతికతే పాత్రల చిత్రణలో కీలకమైంది. స్టాప్ మోషన్‌ను తోసిరాజని వీటికే ప్రాధాన్యతనిచ్చే దర్శకులు చాలామందే ఉన్నారు. స్టీఫెన్ స్పీల్‌బర్గ్, జేమ్స్ కేమరూన్, జిమ్ హెన్సన్ వంటి దిగ్గజ దర్శకుల మొదటి ఛాయిస్ యానిమాట్రానిక్స్‌కే.

జురాసిక్ ప్రపంచం

జురాసిక్ పార్క్ సినిమాలంటే పిల్లలతో పాటు పెద్దలు టికెట్ల కోసం క్యూలో నిలుచుంటారు. కోట్ల ఏళ్ల క్రితం అంతరించిపోయిన అతిపెద్ద జీవజాతిని పుస్తకాల్లో కాకుండా తెరపై చూడటం అంటే అంత కన్నా ఆకట్టుకునే అంశం ఏముంటుంది. అదీ స్టీఫెన్ స్పీల్‌బర్గ్ లాంటి మేధావి దర్శకుడైతే ఆ సినిమాలోని జీవుల ఆకారాలకు అథంటిసిటీ సర్టిఫికెట్ ఉన్నట్టే. డైనోసార్లలోని అనేక

జాతులను కళ్లారా చూశామనే భావన కలుగుతుంది జురాసిక్ పార్క్ చిత్రం చూస్తే. టి-రెక్స్‌లు, వెలోసిర్యాప్టర్, అల్లోసారస్, అపాటోసారస్, బ్రాకియోసారస్, స్టీగోసారస్, యాంకైలోసారస్, పారాసారోలోఫస్, ట్రిసెర్యాప్టర్‌లు వంటి అనేక రకాల రాక్షసబల్లులకు తెరపై ప్రాణం పోశారు. స్కూల్ విద్యార్థులకు రాక్షసబల్లుల గురించి ఇది వివరించినంత లోతుగా మరే పుస్తక సమాచారం నేర్పించలేదని అంటారు. ఇదంతా కూడా సజీవంగా తెరపై కనిపించే రాక్షసబల్లుల ప్రభావమే. ఈ సజీవత గ్రాఫిక్స్ వల్ల రాలేదు. యానిమాట్రానిక్స్ వల్లే ఇది సాధ్యమైంది. ఈ సాంకేతికతతో నిర్మించిన అతిపెద్ద రూపం టి-రెక్స్ డైనోసారస్ లైఫ్ సైజ్ యానిమాట్రానిక్‌దే. స్టాన్ విన్‌స్టన్ అనే సాంకేతికవేత్త బృందం 1993లో వచ్చిన జురాసిక్ పార్క్ సినిమా కోసం దీన్ని తయారుచేశారు. చాలామంది పొరబడినట్టు అది కంప్యూటర్ గ్రాఫిక్స్ కాదు. 20 అడుగుల ఎత్తు, 40 అడుగుల పొడవు, 4100 కేజీల బరువున్న ఈ భారీ యానిమాట్రానిక్ సాయంతోనే స్పీల్‌బర్గ్ తనకు కావాల్సిన యాక్షన్ పండించాడు. సెట్‌లో దాన్ని చూసి నిజమైన టైరాన్నోసారస్ అనుకుని జడుసుకున్నవారు చాలామందే ఉన్నారట. జురాసిక్ సిరీస్ తర్వాత దాదాపు 14 ఏళ్ల తర్వాత కొన్ని నెలల ముందే విడుదలైన తాజా చిత్రం జురాసిక్ వరల్డ్‌లోను క్లోజప్ షాట్లకు ఈ సాంకేతికతనే ఉపయోగించారు. అపాటోసారస్ మృతి వంటి భావోద్వేగ సన్నివేశాలు ఎక్కువగా ఉన్న ఈ చిత్రంలో దర్శకుడు కొలిన్

ట్రెవెర్రో వాటి కోసం గ్రాఫిక్స్ బదులు యానిమాట్రానిక్స్‌కే ఓటు వేశాడు.

టెర్మినేటర్‌కి కాళ్లు చేతులు

ఆర్నాల్డ్ స్వాజినెగ్గర్ కెరీర్ బెస్ట్‌లుగా నిలిచిపోయిన టెర్మినేటర్, ప్రిడేటర్ వంటి చిత్రాల్లోను యానిమాట్రానిక్స్‌ను ఉపయోగించారు. ప్రిడేటర్‌లోని ఆదిమజీవి ఆర్నాల్డ్ మధ్య సాగే ముష్టియుద్ధంలో దాని మాస్క్ తీసినపుడు ముఖభాగాలు కదలికలు ప్రేక్షకుల ఒళ్లు జలదరింపజేస్తాయి. అలాగే టెర్మినేటర్‌లోని భీకరపోరులోను యంత్రం కింద నలిగిపోయే ఆర్నాల్డ్ చేతి భాగం కూడా యానిమాట్రానిక్స్‌తో తయారుచేసిందే. మన ఊహకు రాని రూపాలను సజీవంగా నిలిపే ఈ సాంకేతికత ఎన్నో బ్లాక్‌బస్టర్‌లకు ప్రధాన విజయ రహస్యం అయ్యింది. 'ఈ.టీ ది ఎక్స్‌ట్రా టెరెస్ట్రియల్' చిత్రంలోని ఏలియన్ ముఖాన 150 రకాల విభిన్న కదలికల్ని ఈ సాంకేతికతనో రాబట్టారు. ఏలియన్స్ చిత్రంలోని ఏలియన్ క్వీన్ 14 అడుగుల భారీ యానిమాట్రానిక్‌ను ఇద్దరు దానిలోపల ఉండి చేతులని కదిలిస్తే, 16 మంది మిగతా భాగాన్ని కదిలించారు.



ప్రొమిథియెస్‌లో ప్రాధాన్యం

ప్రొమిథియెస్ సినిమా భూమిపై జీవి పుట్టుక



గురించి, గ్రహాంతరవాసుల గురించి, ముఖ్యంగా అంగారక యాత్రల ప్రాధాన్యల గురించి చాలా మంది వీక్షకుల ఆలోచనల్ని మార్చేసింది. ఆ సినిమాలో తీసుకున్న అంశానికి శాస్త్రీయంగా మద్దతున్నా లేకున్నా అందులో ఆవిష్కరించిన అంగారక జీవులు, ప్రొమిథియన్ జాతి నిద్రపట్టకుండా చేస్తాయి. ఆ సినిమాలోని కొన్ని సన్నివేశాలు యానిమాట్రానిక్స్‌తో తప్ప మిగతా వాటితో చేయలేవన్నట్టు ఉంటాయి. ఉదాహరణకు అంగారక జీవుల కుహరంలోకి అడుగుపెట్టిన శాస్త్రవేత్తల బృందంలో తప్పిపోయిన ఇద్దరు ఓ సర్పం లాంటి జీవి బారిన పడతారు. శరీరాల్లోకి చొచ్చుకుపోతూ కండరాలని మెలిపెడుతూ భయానకంగా హతమార్చే సన్నివేశాలకు యానిమాట్రానిక్స్‌తో రూపొందించిన సర్పాన్నే వినియోగించారు. మరో కీలక సన్నివేశం ప్రొమిథియన్ మనిషి మాస్క్ తీసినపుడు అప్పుడే రోదసి నిద్ర నుంచి మేలుకున్న అతడి ముఖ హావభావాలకు కూడా ఈ సాంకేతికతనే వాడారు.

మన చిత్రాలకూ..

గుస్తావ్ హూగెన్, లెగసీ ఎఫెక్ట్స్ వంటి పేర్లు యానిమాట్రానిక్స్ రంగంలో ఇప్పుడు ఎక్కువగా వినబడుతున్న పేర్లు. గత ఆరేళ్లుగా విడుదలైన హాలీవుడ్ చిత్రాలు 2012, ది ఎవెంజర్స్, ఐరన్‌మేన్, హంగర్ గేమ్స్, ఎక్స్‌మెన్, గాడ్జిల్లా, వరల్డ్ వార్ జెడ్ వంటి చిత్రాలకు పనిచేసిన లెగసీ ఎఫెక్ట్స్ భారతీయ చిత్రం రోబోకు కూడా సేవల్ని అందించింది. ఐ రోబో, ది సెంటెన్నియల్ మ్యాన్, రోబో కాప్ వంటి భిన్న కథాంశాలున్న హాలీవుడ్ చిత్రాలు రోబోటిక్ టెక్నాలజీ అది హ్యూమనాయిడ్‌లపై భారీ చర్చనే ప్రపంచ వర్గాల్లో లేవదీశాయి. సరిగ్గా ఇదే చర్చకు భారత్‌లో తెరలేపింది రోబో. ఘటోత్కచుడు వచ్చిన చాలా ఏళ్ల తర్వాత నూతన సాంకేతికతను ఉపయోగిస్తూ హ్యూమనాయిడ్ శక్తిని అమాంతం పెంచేసి చూపించిన ఈ చిత్రం శంకర్ వండర్‌గా నిలిచి పోయింది. ఆ తర్వాత షారుక్ తీసిన 'రా-వన్' ఈ చిత్రానికి ఏ మాత్రం పోటీనివ్వలేకపోయింది. అంత అద్భుతంగా తీశాడు శంకర్ ఈ చిత్రాన్ని. ఈ చిత్రంలోని రోబో తనకు తానే డిస్‌మ్యాంటిల్ చేసుకునే రోబో 'చిట్టి' సన్నివేశం హృదయాలను ద్రవింపజేస్తుంది. ఆ తర్వాత అదే రోబో తల భాగం ప్రదర్శన వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులతో మాట్లాడుతుంది. ఈ బరువైన సన్నివేశాల్లో సజీవతను నిలిపింది యానిమాట్రానిక్సే. వీటి కోసం లెగసీ ఎఫెక్ట్స్ 40 రకాల రజనీకాంత్‌ను పోలే రోబో మాన్నెక్విన్స్ బొమ్మలను రూపొందించింది. సుమారు 22 సన్నివేశాలకు రోబోలో యానిమాట్రానిక్స్‌ను ఉపయోగించారు. 2 రోబో యానిమాట్రానిక్ పప్పెట్స్‌ను కూడా ఉపయోగించారు. ప్రస్తుతం కన్నడ దర్శకుడు షాబుద్దీన్ ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. తన కలల ప్రాజెక్ట్‌లో భారీస్థాయిలో యానిమాట్రానిక్స్‌ను ఉపయోగించనున్నారని ఆయన తెలిపాడు. ఈ ప్రాజెక్ట్‌లో ఇంతకు ముందు భారత చిత్ర పరిశ్రమలో వినియోగించనంత స్థాయిలో యానిమాట్రానిక్స్ సాంకేతికతను ఉపయోగించుకోవాలని ఆయన చూస్తున్నాడు. ఈ టెక్నాలజీ మాత్రమే తన కలల్ని సజీవంగా తెరపై నిలపగలదని ఆయన చెప్పారు. ఈ 'లార్జర్ దాన్ లైఫ్' టెక్నాలజీ ఊహాతీతాలకు ప్రాణం పోస్తూ ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతుల్ని కలిగిస్తోంది. త్వరలో శంకర్ రోబో-2 విడుదలవబోతోంది. హాలీవుడ్ క్లాసిక్ సీక్వెల్స్‌తో పాటు మరెన్నో యాక్షన్, సై-ఫై, హారర్ థ్రిల్లర్లు రాబోతున్నాయి. వీటిలోను గ్రాఫిక్స్‌తో పాటు యానిమాట్రానిక్స్ అద్భుతాల్ని కళ్లకు కట్టనున్నాయి.

- అనన్య ప్రసిద్ధ్



ప్రాన్స్ ఫీస్ట్

కావలసిన పదార్థాలు

రొయ్యలు-1/2 కేజీ
మంచి నూనె- తగినంత
వెల్లుల్లి-25 రేకలు
కొత్తిమీర తరుగు-1/4 కప్పు
చింతపండు-15 గ్రాములు
టమాటోలు-2
ఆవాలు, జీలకర్ర -1 టేబుల్ స్పూన్

తయారుచేసే విధానం

పాన్‌లో నూనె వేసి వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలు, పొట్టుతీసిన వెల్లుల్లి రేకలు, టమాటో ముక్కలు, ఆవాలు, వేసి వేయించుకోవాలి. ఇవి ముదురు రంగు వచ్చే దాకా వేయించాలి. బాగా వేగిన తర్వాత మసాలా పొడిని వేసి బాగా కలియ బెట్టాలి. దీంట్లోనే చింతపండు రసం, తగినంత నీరు పోసి మెత్తటి పేస్ట్‌లాగా ఉడికించుకోవాలి. తరువాత అందులో శుభ్రం చేసుకున్న రొయ్యలను వేసి బాగా కలియబెట్టాలి. వాటికి బాగా మసాలా పట్టి, బాగా ఉడికేంత వరకు అలాగే తక్కువ మంటపై ఉడికిచాలి. చివరిగా సరిపడా ఉప్పు వేసి పైన కొత్తిమీర తరుగు చల్లి దించేయాలి.



ఇదివేడిగా ఉన్నప్పుడే రోటీల్లోకి సైడ్‌డిష్‌గా వాడుకుంటే చాలా టేస్టీగా ఉంటుంది.

మటన్ ఖడా మసాలా

కావాల్సిన పదార్థాలు

బోన్‌లెస్ మటన్ -1కిలో
అల్లం వెల్లుల్లి పేస్ట్- 3 టేబుల్ స్పూన్లు
ధనియాల పొడి- 1 టేబుల్ స్పూన్
జీలకర్ర పొడి-2 టేబుల్ స్పూన్లు
గరం మసాలా- 2 టీ స్పూన్లు
పసుపు-1 టీ స్పూన్
కారం-2 టీ స్పూన్లు
అవనూనె-20 మి.లీ
ఉప్పు-రుచికి సరిపడా

తయారుచేసే విధానం

మటన్‌ను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కోయాలి. గిలకొట్టిన పెరుగులో ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, పసుపు, ఉప్పు, కారం, అల్లం వెల్లుల్లి ముద్దవేసి కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముక్కలకు పట్టించి ఆరుగంటలు నాననివ్వాలి. మందపాటి పాన్‌లో నూనె వేసి వేడెక్కిన తర్వాత పెరుగు మిశ్రమం పట్టించిన ముక్కలు వేసి కొద్దిగా వేయించి మూత పెట్టి మెత్తగా అయ్యే వరకూ ఉడికించి దించాలి.

చికెన్ సీక్

కావాల్సిన పదార్థాలు

బోన్‌లెస్ చికెన్ -800గ్రా
ఉల్లిపాయలు-2
పచ్చిమిర్చి-50 గ్రా
అల్లం-30గ్రా
వెల్లుల్లి పలుకులు-20 గ్రా
కొత్తిమీర తరుగు-1కప్పు
ఎండుమిర్చి-2
గరంమసాలా- 2 టేబుల్ స్పూన్లు
నెయ్యి-వంద గ్రాములు
ఉప్పు-రుచికి తగినంత
ఛాట్ మసాలా- 20 గ్రాములు



తయారుచేసే విధానం

ముందుగా ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చిని సన్నగా తరగాలి. ఇందులో చికెన్ వెల్లుల్లి పలుకులు కొత్తిమీర, ఎండు మిర్చి, గరంమసాలా వేసి బాగా కలపాలి. తడిచేత్తో మిశ్రమం ముక్కలకి పట్టేలా బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత ఒక్కో చికెన్ ముక్కను ఇనుప చువ్వకు గుచ్చి ఐదు నిమిషాల పాటు సన్నని మంటపై కాల్చాలి. వీటికి మళ్ళీ నెయ్యి రాసి మరో రెండు నిమిషాలు దోరగా కాల్చుకోవాలి. ఇప్పుడు ఒక్కో ముక్కని బైటకి తీసి పైన ఛాట్ మసాలా చల్లితే నోరూరించే కబాబ్ రెడీ!

పదాలు గుర్తించండి

ఇక్కడున్న పట్టికలో కొన్ని అక్షరాలు ఉన్నాయి. అయితే మీరు చేయాల్సిందేంటంటే.... కింద ఇచ్చిన పదాలు ఆ అక్షరాల పట్టికలో ఎక్కడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.

W	P	R	O	B	I	N	P	E	S	R	G	H	I	P	H	R	S
P	S	K	D	D	C	E	L	P	E	B	G	A	P	P	Z	F	T
U	U	X	L	A	L	M	L	G	A	G	L	R	R	M	F	X	C
D	N	S	D	I	F	F	H	U	S	U	S	O	E	D	O	L	Q
D	S	H	M	E	L	F	L	E	O	M	E	W	S	E	E	J	R
L	H	O	E	O	U	A	O	O	N	B	E	E	W	S	N	N	A
E	I	W	L	N	E	B	C	D	W	R	D	A	N	G	O	J	I
N	N	E	T	A	G	U	W	S	I	E	S	T	Z	R	W	M	N
L	E	R	I	R	K	D	L	N	E	L	R	H	V	O	H	S	B
F	X	S	N	E	X	S	D	Z	K	L	F	E	R	W	N	U	O
R	H	D	G	G	B	C	W	V	G	A	X	R	A	I	N	N	W
N	V	C	R	O	C	U	S	C	Y	Y	U	W	A	R	M	T	D

Find the following words in the puzzle.
Words are hidden → ↓ and ↘ .

BLOSSOM
BUDS
CROCUS
DAFFODIL
FLOWER
GARDEN
GREEN
GROW
LILACS
MELTING
PUDDLE
RAIN
RAINBOW
ROBIN
SEASON
SEEDS
SHOWERS
SUN
SUNSHINE
UMBRELLA
WARM
WEATHER

కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఒక ఆకారాన్ని ఇక్కడుంచాం. పక్కనున్న కొన్ని అగ్గిపుల్లల్ని కదిలిస్తే రెండు చతురస్రాలు ఏర్పడతాయి. అదెలాగో కనిపెట్టండి.



చుక్కలు కలపండి



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనొక స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

ఆ సజ్జనిర్మలా

నీడతో బొమ్మ



పిల్లలూ! చేతి వేళ్ళతో గుర్రం బొమ్మని ఎలా చేయొచ్చో ఇక్కడిచ్చాం చీకటి గదిలో చిన్న వెలుగులో మీరూ ప్రయత్నిం చండి.

తేడాలు గుర్తించండి



చింటూ వాళ్ల ఇంట్లో కొన్ని బొమ్మలున్నాయి. ఈ రెండు చిత్రాల్లో ఏడు తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నా చుట్టేయండి.

12 ఏళ్ల స్కేటర్

పిల్లలూ మీరు స్కూల్లో నిర్వహించే రకరకాల ఆటలపోటీల్లో పాల్గొనే వుంటారు. మరి మీరెప్పుడైనా స్కేటింగ్, ఐస్ స్కేటింగ్ లాంటివి చేశారా....అయితే చక్రాలని అమర్చిన స్కేట్ బోర్డ్‌లని కట్టుకుని రివ్వు రివ్వుమంటూ తిరిగేస్తూ పతకాలు సాధించేస్తోంది శ్రిష్టి శర్మ(12). రోలర్, లింబో స్కేటింగ్‌లలో ఆరితేరిన ఈ చిన్నారి గురించి మీరూ తెలుసుకోండి.

గతేడాది సెప్టెంబర్‌లో గుర్గావ్‌లో స్కేట్ రింగ్‌లో ఓ కొత్త ఉత్కంఠత మొదలయ్యింది. అదేంటంటే పది మీటర్ల పొడవున నేలపై 33 సెం.మీ ఎత్తున పదకొండు బార్స్ ఏర్పాటు చేసున్నాయి. వీటి మధ్య కనీకనిపించనంత తేడా మాత్రమే వుంది. నేలనంటుకుంటునట్టు కనిపించే ఆ మార్గంలో ఎవరు దూసుకెళతారా అని అందరూ ఎదురు చూస్తున్నారు. ఈలోపే రివ్వమంటూ ఓ అమ్మాయి దూసుకొచ్చింది. మొత్తం పదిమీటర్ల దూరాన్నీ పూర్తిచేసిన అమ్మాయిగా లిమ్కాబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు దక్కించుకుంది శ్రిష్టి. నాగపూర్‌లోని గుర్‌గావ్‌కి చెందిన అమ్మాయి శ్రిష్టి. లింబో స్కేటింగ్‌లో దూసుకుపోతున్న ఈ అమ్మాయి ఇప్పటికే లింబో స్కేటింగ్, ఐస్ స్కేటింగ్‌లో లిమ్కాబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో ఇప్పటికే చోటుదక్కించుకుంది. వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన శ్రిష్టి రోలర్ స్కేటింగ్‌లో 2015లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పేరు నమోదు చేసుకుంది. ఆ తర్వాత నెల రోజులకే ఐస్ స్కేటింగ్‌లోకీ ప్రవేశించింది. చదువతోపాటు ఈ క్రీడలో రాణించేందుకు తను రోజుకి మూడు గంటల పాటు ప్రాక్టీస్ చేస్తుందట. శ్రిష్టితోపాటు తన అక్క సిద్ధి కూడా క్రీడల్లో కొనసాగుతోంది. రోలర్ హాకీ ప్లేయర్‌గా జాతీయస్థాయి పతకాన్ని దక్కించుకున్న అక్కే తన రోల్ మోడల్. వీళ్ళిద్దరికీ తల్లిదండ్రులు కూడా ఎంతో ప్రోత్సహిస్తున్నారు. తండ్రి కోల్ ఇండియాలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తల్లి ప్రేరణతో క్రీడల్లో మరింత ముందుకు సాగుతున్న శ్రిష్టి ఆటలతోపాటు ఆడపిల్లలని రక్షించే దిశగా సాగుతున్న 'సేవ్ ది గర్ల్ చైల్డ్' క్యాంపెయిన్‌లో పాల్గొంటోంది.

పదవికాసం 72

కూర్పు : రావెళ్ళ

■	1	2		■	3	4		■
5	■		■	6	■		■	■
7		■	8			■	9	10
	■	11	■		■	12	■	
13				■	14			
	■		■	15	■		■	
16		■	17			■	18	
■	■	19	■		■	20	■	
■	21			■	22			■

ఆధారాలు

అడ్డం

1. ఇదిలేని వారిని ఊరి నుండి తరిమెయ్య మంటారు (3)
3. సొమ్ము (3)
7. అటునుంచి వోలు (2)
8. రక్షణ (3)
9. వ్యాయామం (2)
13. బాగా తన్నడాన్ని ఇలా చేశారని అంటుంటారు (4)
14. తిరగబడ్డ కాశి (4)
16. అటు నుండి కపటం (2)
17. శబ్దం (3)
18. బట్ట మడత (2)
21. సామ్యం (3)
22. సన్నని రాయి (3)

నిలువు

2. గుడిసె (2)
4. వీలునామ (2)
5. దాశరథి రచన... ఈ దేవుళ్ళు (6)
6. రూపాయిలో నాల్గోవంతు (3)
10. కొలకలూరి ఇవాక్ పుస్తకం (6)
11. శుభం కాదు(3)
12. అర్థణాలు...బేదలకు మధ్యనున్నవి (3)
15. గజ్జెలు (3)
19. శీతలమైన (2)
20. కలకల ధ్వని (2)

సుడోకు

					1	2	3	
1	2	3			8		4	
8		4			7	6	5	
7	6	5						
						1	2	3
	1	2	3			8		4
	8		4			7	6	5
	7	6	5					

7	9	3	8	6	4	5	1	2
6	5	4	1	2	3	8	9	7
1	2	8	9	7	5	3	6	4
5	8	6	2	1	9	7	4	3
2	7	9	3	4	6	1	8	5
3	4	1	7	5	8	6	2	9
8	3	5	4	9	1	2	7	6
9	1	2	6	3	7	4	5	8
4	6	7	5	8	2	9	3	1

గతవారం జవాబులు

1 తె	లి	2 వి	■	3 వ	న	4 భో	జ	5 నం
ళ్ల	■	ద్య	■	ని	■	లి	■	ది
6 వా	ర్త	■	7 చే	త	8 న	■	9 క	ని
రు	■	10 ర	వ	■	11 లి	12 పి	■	■
13 న	గు	వె	■	14 కా	■	15 లు	వా	16 స
■	■	17 పు	18 సి	■	19 పై	పు	■	రి
20 ఫ	న	■	21 పం	22 ట	కం	■	23 ట్టు	కొ
న	■	24 మ	■	క్క	■	25	■	త్త
26 స	మా	నం	స	రి	■	27 గా	ను	గా

కలం పని

రంగుల్లో ఓ జంట చాలా ప్రత్యేకం. లేత గోధుమ రంగుపై నిండు కుంకుమ రంగు ఎంత అదాట్టుగా అనిపిస్తుంది. చుట్టూ చాలా కాంబినేషన్లున్నా చూపు మాత్రం అక్కడే కేంద్రీకృతమవుతుంది. ఇదిప్పుడు ఫ్యాషనిస్టాలో... కలర్ స్కీమిస్టాలో.... రంగరించిన జోడీ కాదు ఎప్పటిదో. సుమారు మూడు వేల ఏళ్ల నుంచి కొనసాగుతున్న మన భారతీయ భారీతనం కలంకారీలో అది స్పష్టంగా తెలుస్తుంది. తొలుత ఖాదీ మీద చిత్రీకరించిన ప్రకృతి దృశ్యాలు ఆ తర్వాత అనేక సాంస్కృతిక ప్రభావాల్ని తనలో రంగు పొడిపించుకుంది. ఇప్పుడు వాల్ పెయింట్‌లు కాఫీ కప్పుల వరకు దాని ముద్ర పడిపోతుంది. వస్త్రాల మీద వేసే కలంకారీ పనితనం మచిలీపట్నం, కాళహస్తి, కార్వూరు కేంద్రాలుగా వెల్లివిరిసింది. ఒకప్పుడు సుగంధ ద్రవ్యాల వర్తకంలో ఈ చిత్రాలను కరెన్సీగా కూడా వాడేవారట. ఇండోనేషియా వంటి తూర్పు ఆగ్నేయాసియా దేశాల్లో ఈ వస్త్రాలకు డిమాండ్ ఎక్కువ. జాదూ పటువా, దురాయ్ పటువా అంటే చిత్ర మంత్రగాళ్లనే అర్థం. ఇదే పేరుతో కలంకారీ కళాకారులను పిలిచేవారు. బ్రిటిషోళ్లు ఈ కళను చింట్జ్ అంటే డచ్చివాళ్లు సిట్జ్ అనీ పోర్చుగీస్‌వాళ్లు పింటాడో అని పిలుస్తారు. ఇరాన్‌లోను ఈ కళ వర్ధిల్లింది.

పర్వత సరస్సు





హిమాలయాల్లో స్వచ్ఛమైన మంచినీటి సరస్సులు ఉంటాయని తెలుసు. కానీ క్షార నీటి సరస్సులుంటాయని చెబితే నమ్ముతారా..! వాటిల్లో అతి పెద్దది లధాక్‌లోని త్సో మొరీరి. సముద్ర తలానికి 14,836 అడుగుల ఎత్తులో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో పరచుకున్న ఈ సరస్సు భారత్ అతి ఎత్తునున్న సరస్సుల్లోనే అతిపెద్దది. త్సో మొరీరి అంటే పర్వత సరస్సు అని అర్థం. అక్కడక్కడా 130 అడుగుల లోతుండే ఈ సరస్సు చుట్టూ ఉన్న ప్రాంతాన్ని చిత్తడి నేలల పరిరక్షణ ప్రదేశంగా గుర్తించారు. ఒక వేసవి కాలంలో తప్ప మిగతా కాలమంతా గడ్డకట్టుకుపోయే ఈ సరస్సు రుప్షు లోయ ప్రాంతంలోనిది. ఈ సరస్సు చుట్టూతా 20,000 అడుగుల ఎత్తున హిమ పర్వతాలుంటాయి. చాంగ్పా సంచార తెగలు ఇక్కడ మనుగడ సాగిస్తున్నాయి. దీని పశ్చిమ తీరంలోనే 400 ఏళ్ల కోర్జోక్ బౌద్ధారామం ఉంది. ఈ కాలంలోనే ఎక్కువగా పర్యాటకులు వెళుతుంటారు. దీనికి దగ్గరగా మరో చిన్న సరస్సు ఉంటుంది. దాని పేరు 'లేక్ ఆఫ్ జాయ్'. చలికాలంలో మైనస్ 40 డిగ్రీలు వేసవిలో 30 డిగ్రీల మధ్య ఉండే ఉష్ణోగ్రతల వల్ల విచిత్రమైన జీవారణ వ్యవస్థను ఈ ప్రాంతం కలిగి ఉంటుంది.